14. రూ. 10,116-00 శ్రీ యస్.ఆర్.యల్. నరశింహారావు గారు, విశాఖపట్నం, వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ సంజీవరావు గారు, కీ॥శే॥ శ్రీమతి బృందావతి గార్ల జ్ఞాపకార్థం

## విరాళములు

1. రూ. 1,116-00 శ్రీమతి ఎమ్. కన్నెమ్మ గారు, తిరుత్తని (తమిళనాడు)
2. రూ. 1,116-00 శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు, విశాఖపట్నం
3. రూ. 1,117-00 శ్రీ బి. రామగోపాల్ గారు, తుని
4. రూ. 5,000-00 శ్రీ కొల్లి ప్రసాద్ గారు, శ్రీమతి సుబ్బలక్ష్మి గార్లు, కాకినాడ
5. రూ. 1,116-00 శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు, విశాఖపట్నం, పూజ్య స్వామీజీ ఆరాధనకు
6. రూ. 1500-00 శ్రీమతి చెరుకూరి శేషుకుమారి గారు, శాంతి ఆశ్రమము వీరి తండ్రిగారు కీ॥శే॥ అడుసుమిల్లి సత్య ప్రకాశరావు గారి తిథి సందర్భముగా
7. రూ. 5,000-00 శ్రీ కోలా సత్యనారాయణమూర్తి గారు, శ్రీ శాంతి ఆశ్రమం శివాలయం దగ్గర, ఓం బిల్డింగ్ గ్రిల్స్ నిమిత్తము
8. రూ. 1,000-00 Mrs. టి. గీతాంజలి గారు
9. రూ. 1,000-00 Mrs. టి. గీతాంజలి గారు
10. రూ. 10,000-00 శ్రీ టి. వేదాంతం గారు, I.A.S (Retd.), విశాఖపట్నం
11. రూ. 15,000-00 శ్రీ కోలా సత్యనారాయణమూర్తి గారు, శ్రీ శాంతి ఆశ్రమము ఓం మందిరమునకు గ్రిల్స్ బిగించుట (తయారుచేయించుటకు)
12. రూ. 3,000-00 శ్రీమతి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్, అన్నదానం నిమిత్తం, కీ॥శే॥ డా॥ మర్రి చెన్నారెడ్డి గారి జ్ఞాపకార్థము
13. రూ. 3,000-00 శ్రీమతి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్, అన్నదానం నిమిత్తం, కీ॥శే॥ డా॥ మర్రి చెన్నారెడ్డి గారి జ్ఞాపకార్థము
14. రూ. 3,000-00 శ్రీమతి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్, అన్నదానం నిమిత్తం, కీ॥శే॥ డా॥ మర్రి చెన్నారెడ్డి గారి జ్ఞాపకార్థము
15. రూ. 10,000-00 శ్రీమతి కె. విజయ రమ్య గారు, జర్మనీ, D/o. కె. ప్రసాద్ గారు, కాకినాడ పబ్లికేషన్స్ నిమిత్తం.



# శాంతి

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక
స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్
గౌరవ సంపాదకులు : స్వామిని వినమ్రానంద

సంపుటి : 93 ఆగష్టు - 2017 సంచిక : 8

## విషయసూచిక

పేజి నెం.

1. ప్రార్థన - శ్రీ నారాయణ భట్టపాదులు 02
2. ధ్యానము - కఠోపనిషత్తు 05
3. శ్రీ దేవి పురాణం - డా॥ కె. వెంకట శివయ్య 05
4. ప్రణవము - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 07
5. ధ్యానము - స్వామి ఓంకార్, తత్త్వవిదానంద సరస్వతి 11
6. నేతాజీ సుభాష్ చంద్రబోస్ - సిలువేరు సుదర్శన్ 15
7. సమానులెవరు ప్రభో - శ్రీ కె. కోటేశ్వరరావు 16
8. ఉపదేశ సారము - వినతి 17
9. ఏడుచేపల కథ - శ్రీమతి వేల్పూరి సీతాదేవి 19
10. మతము - డాక్టర్ రాధాకృష్ణన్ 20
11. గణేశ ప్రాశస్త్యం - శ్రీమతి వ్రాడేవు శారద 21
12. కైవల్యోపనిషత్ - స్వామిని శృతానంద 23
13. నా అనుభవం - శ్రీమతి సరోజిని 25
14. గోశాల పునర్నిర్మాణము 27
15. వార్తలు - విరాళాలు 28

☛ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి - రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు. - ఎడిటర్

*జీవిత సభ్యత్వం (12 సం॥) : రూ. 1000/-* *సాలుసరి చందా : రూ. 100/-*

# ప్రార్థన

**- శ్రీ నారాయణ భట్టపాదులు**

**అయి దేవ పురా కిల త్వయి - స్వయముత్తానశయే స్తనంధయే,**
**పరిజృంభణతో వ్యపావృతే - వదనే విశ్వ మచష్ట వల్లవీ. 1**

భగవాన్! ఇంతకుమునుపే (నీ పసితనమున) నీవు నీ తల్లి ఒడిలో వెలకిలగా పరుంటివి. ఆమెకడ పాలు త్రావుచుంటివి. ఆ సమయమున నీవు బాగుగా నోరు తెరచి ఆవులించితివి. అప్పుడు నందగోవుని పత్నికి (నీ తల్లి అగు యశోదకు) నీ నోటిలో విశ్వమంతయు కనబడెను.

**పునరప్యథ బాలకై స్సమం - త్వయి లీలానిరతే జగత్పతే,**
**ఫలసంచయవంచనక్రుధా - తవ మృద్భోజన మూచు రర్భకాః. 2**

అటుతరువాత మరియొక మారు నీవు నీ తోడి బాలకులతో కలిసి ఆటలాడుచుంటివి. జగన్నాథా! ఆ ఆటలలో ఆ బాలురు సేకరించి తెచ్చుకొనిన పండ్లను నీవు దాచితివి, దానిచే వారికి నీమీద కోపం వచ్చెను. దానితో వారు నీ తల్లియగు యశోదతో నీవు మన్ను తింటివని కొండెములు చెప్పిరి.

**అయి తే ప్రలయావధౌ విభో - క్షితితోయాదిసమస్తభక్షిణః,**
**మృదుపాఠి_శనతో రుజా భవే - దితి భీతా జననీ చుకోప సా. 3**

ఓ విభూ! సృష్టిస్థితుల కాలావధి ముగిసి ప్రలయము జరుగవలసిన కాలపు అవధి (గడువు) రాగానే ఆ సమయమున భూమి - జలము మొదలగు పంచభూతములను నిశ్శేషముగా భక్షించుచుందువు. (వానినన్నిటిని నీయందు లయమందునట్లు చేసికొందువు) ఇట్టి మహాశక్తి సంపన్నుడవగు నీవు మట్టిని ఉపాహారముగా తినుట వలన నీకు బాధ కలుగును, రోగము వచ్చును, అను భయముచే నీ తల్లియగు యశోద నీపై కోపగించెను.

**అయి దుర్వినయాత్మక త్వయా - కిము మృత్స్నా బత వత్స భక్షితా,**
**ఇతి మాతృగిరం చిరం విభో - వితథాం త్వం ప్రతిజజ్ఞిషే హసన్. 4**

'నాయానా! నీవు ఎంతటి అల్లరి పిల్లవాడవురా! మట్టినే తింటివి కదరా!' అని యశోద నీతో కోపముగా పలికెను. కాని నీవు ఆమెతో 'నేను మన్ను తింటిని అనుమాట





సత్యము కాదమ్మా!' అనుచు నవ్వుచు చాలసేపు గట్టిగా పలికితివి.

**అయి తే సకలై ర్వినిశ్చితే - విమతిశ్చే ద్వదనం విదార్యతామ్,**
**ఇతి మాతృవిభర్త్సితో ముఖం - వికసత్పద్మనిభం వ్యదారయః. 5**

అప్పుడు ఆమె 'ఓయీ! నీవు మన్ను తింటివి అని అందరును నిశ్చితముగా పలుకుచున్నారు' అట్టి విషయము నీవు 'కాదు' అనుచున్నావు, నీవు చెప్పునదే యథార్థమయిన యెడల - పద! నీ నోరు తెరచి చూపుము. అని నీ తల్లి నిన్ను బెదిరించెను. అంతట నీవు విప్పారిన పద్మమును పోలు నీ నోటిని తెరచితివి.

**అపి మృల్లవదర్శనోత్సుకాం - జననీం తాం బహు తర్పయన్నివ,**
**పృథివీం నిఖిలాం న కేవలం - భువనాన్య ప్యఖిలా న్యదీదృశః. 6**

వాస్తవమున నీ తల్లి నీవు మట్టిని సత్యముగనే తింటివి. అని తలచెను. అందుచే నీ నోటిలో కొంచెమైన మట్టి ఉండి యుండును. అది చూడవలయును. అను గట్టి కుతూహలముతో ఆమె యుండెను. అట్టి నీ తల్లిని యశోదను మిక్కిలిగా తృప్తి చెందించుటకో అనునట్లు నీవు కొంచెపాటి మట్టిని మాత్రమే కాదు. పృథివిని మొత్తమునే కాదు - సకల భువనములనే నీవు నీ నోటిలో ఆమెకు చూపితివి.

**కుహచి ద్వన మంబుధిః క్వచిత్ - క్వచి దభ్రం కుహచి ద్రసాతలమ్,**
**మనుజా దనుజాః క్వచి త్సురా - దదృశే కిం నతదా త్వదాననే. 7**

ఒకచోట వనము(లు) మరియొకచోట సముద్రము(లు) ఇంకొకచోట మేఘము(లు) వేరొకచోట రసాతలలోకము మరి వేరువేరు స్థానములందు మనుజులును, దానవులును దేవతలును - ఇట్లు అన్నియు కనబడెను. ఇది-అది అనవలసినదేమి? నీ నోటిలో ఆ యశోదకు ప్రపంచము నందు ఉండు - ఉండవలసిన - సకల దృశ్యపదార్ధములును నిశ్శేషముగా కనబడెను.

**కలశాంబుధిశాయినం పునః - పరవైకుంఠపదాధివాసినమ్,**
**స్వపురశ్చ నిజార్భకాత్మకం - కతిధా త్వాం న దదర్శ సా ముఖే. 8**

ఆమెకు నీ నోటిలో నీవు క్షీరసముద్రమున శయనించినవాడుగా కనబడితివి, సర్వోత్తమలోకమగు వైకుంఠ స్థానమున నివసించువాడుగాను కనబడితివి. ఆమె కంటి ఎదుటనో! తన పసివాడుగానే కనబడుచుంటివి. ఇట్లు ఆమెకు నీవు నీ నోటిలో కాని ఈవల

కాని ఎన్నెన్ని విధములుగా కనబడితివో చెప్ప శక్యము కాదు ప్రభూ !

**వికసద్భువనే ముఖోదరే – నను భూయో౽పి తథావిధా౽౽ననః,**
**అనయా స్ఫుట మీక్షితో భవా – ననవస్థాం జగతాం బతా౽తనోత్. 9**

హే భగవాన్! ఇంకొక ఆశ్చర్య మేమనగా అట్లు నీవు తెరచిన నీ నోటిలో సంపూర్ణ వికాసము నందిన నిండురూపముతో సకల భువనములును కనబడుచుండుటతోపాటు ఆ నోటిలోనే నీ తల్లికి తన నోరు తెరచి చూపుచున్న నీవును అందు సకల లోకములును కనబడుచుండెను. ఇట్లు దానిలో మరియొకటి అను వరుసలో అనంత కృష్ణులును అనంత యశోదలును అనంతానంతలోకములును ఆమెకు చూపి నీ సృష్టికికల అనంతత్వమును ఆమెకు తెలియజేసితివి ప్రభూ!

**ధృతతత్త్వధియం తదా క్షణం – జననీం తాం ప్రణయేన మోహయన్,**
**స్తన మంబ దిశేత్యుపాసజన్ – భగవ న్నద్భుతబాల పాహి మామ్. 10**

ఈ విధమగు దర్శనముచే ఒక క్షణకాలము ఆమెకు తత్త్వజ్ఞానము కలిగెను. ఆ తత్త్వజ్ఞానము ఆమె హృదయమున కుదురుకొనెను కూడ. అట్టి నీ తల్లిని నీవు నీకు ఆమెయందు కల ప్రాపంచికమగు స్నేహమును ప్రకటించుచు ఆమెకు నీపై పుత్రవాత్సల్యమును ఉద్దీపింప జేసితివి. ఆ విధముగా నీవు ఆమె హృదయమున లోకసహజమగు మోహమును కలిగించితివి. అమ్మా! నాకు స్తన్యము ఇమ్ము. అని తల్లితో అంటుకొంటివి. ఇటువంటి అద్భుతబాలుకా! నన్ను రక్షించుమా!

**– శ్రీ నారాయణీయమ్**

అన్ని శాస్త్రాల ఉపదేశం ఏమిటి? అన్ని మతాల సారం ఏమిటి? సాధువు లందరూ మనకు ఉపదేశించే జీవన సూత్రం ఏది? ఈ విశ్వానికంతా ఒకే ఒక ఆధారమైన తత్త్వం ఉంది. మానవుని జన్మ సార్థకం కావాలంటే దాన్నే లక్ష్యంలో ఉంచుకోవాలి. సకల మానవ వర్గం, సకల విశ్వం దానిలోనే నెలకొని వుంది. అదే నీ స్వరూపమైన ఆత్మ.

– శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతి స్వామి



# ధ్యానము

**– కఠోపనిషత్తు**

**మూ॥ ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।**
**ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వాయో యదిచ్ఛతి తస్య తత్ ॥**

ఓంకారమే అక్షరమగు పరబ్రహ్మము. ఈ ఓంకారమగు అక్షరమే పరమపదము. ఈ అక్షర స్వరూపమగు ఓంకారమును తెలుసుకొనినవారు. ఏది యిచ్ఛయింతురో దానిని పొందుదురు. అనగా ఈ ప్రణవోపాసకులు ప్రణవ బ్రహ్మమును పొందుదురు. అంతేగాక మరియేదైన ఉత్కృష్టమైన కోరిక గలిగియుండిన అదియు తప్పక సిద్ధించును.

**మూ॥ ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరమ్ ।**
**ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥**

బ్రహ్మప్రాప్తికి అవలంబింపదగిన అనగా అనుష్ఠింపందగిన మార్గములలో నీ ఓంకారోపాసనయే శ్రేష్ఠమైన సాధనమగును. ఈ ప్రణవోపాసనయే పరమైన అవలంబనమగును. ఈ ప్రణవోపాసన నవలంబించువాడు బ్రహ్మ లోకములో పూజ్యుడగును. అనగా బ్రహ్మప్రాప్తిని పొందును.

# శ్రీ దేవి పురాణం

***– డా॥ కె. వెంకట శివయ్య*, I.A.S (Rtd.)**

బ్రహ్మ పరాశక్తిని ప్రశ్నిస్తాడు. అమ్మా నీవు పరబ్రహ్మవా? పురుషుడవా? స్త్రీవా? లేక నపుంసకుడివా?

భగవతి మధుర వాక్యములతో త్రిమూర్తులారా? శ్రద్ధగా వినండి ఈ పరబ్రహ్మ ఒక్కటే! ఆ పరబ్రహ్మ నేనే, నేనే ఆ పరబ్రహ్మను. ఈ సత్యమును బంధములు దాటినవారు మాత్రమే గ్రహించగలరు. ఆ పరబ్రహ్మ నిత్యం, సనాతనం నేను కూడ ఆయనలో ఏకదేశము. ఉదా॥ దీపం ముందు అద్దం పెడితే అద్దమును బట్టి దీపము వుంటుంది. బ్రహ్మ! వివిధ దేవతల రూపంలో వున్నది నేనే. సర్వశక్తి స్వరూపిని, ఎవరిలోనైనా ఏదైన పరాక్రమము వుంటే అది నేనే. జలములోని శీతలము నేనే. ఉష్ణములోని ఆ ఉష్ణశక్తిని నేనే. దివాకరుడిలోని వెలుగును నేనే. నిశాకరుడిలోని (చంద్రుడు) చల్లదనము నేనే. నా శక్తి లేకుండా అణువు

కూడా కదలదు. విద్యాబలం అయినా, శరీర బలం అయినా ఏదైన శక్తి రూపంలో వున్నదంతా నేనే!. కాబట్టి మీరు కేవలం మీ మీ కర్తవ్యములను సక్రమంగా నిర్వహించండి.

త్రిమూర్తులకు మణిదీపంలో, చింతామణి సౌధంలో పరాశక్తిలోని ఒక అంశతో సరస్వతీదేవిని సృష్టించి రాజసాంశ అయిన బ్రహ్మకు ఇచ్చి వివాహం చేసెను. మీరు ఇరువురు పరస్పరము పూజింపదగినవారు. సత్యలోకమునకు వెళ్ళి సృష్టికార్యమును కొనసాగించమని కర్తవ్య బోధ చేసెను. తర్వాత సాత్వికాంశ అయిన విష్ణుమూర్తిని పిలిచి, లక్ష్మీదేవిని ఇచ్చి వివాహం చేసెను. దేవతలకు ఆపద కలిగినప్పుడు, ధర్మానికి నష్టం వాటిల్లినప్పుడు విష్ణువు వివిధ అవతారాలలో జన్మిస్తూ వుంటాడు. పరాశక్తి సహాయంతో దుష్టులను సంహరిస్తాడు మరియు లక్ష్మీదేవిని వక్షస్థలమందు ధరిస్తాడు అని, ఐం హ్రీం క్లీం చాముండాయై నమః అని నవాక్షర మంత్రాన్ని ఇచ్చి సర్వదా, సర్వకార్యములందు ఈ మంత్రాన్ని జపిస్తూ వుండు, వైకుంఠానికి వెళ్ళి సృష్టి రక్షణ కార్యం కొనసాగించండి అని విష్ణుమూర్తి లక్ష్మీదేవికి కర్తవ్య బోధ చేస్తుంది. అదే విధంగా శంకరుడికి గౌరీదేవిని ఇచ్చి వివాహం చేసి ఈమె మహాకాళి. కైలాసానికి వెళ్ళి తమోగుణాంశతో సృష్టిని లయం చేస్తూ వుండండి అని కర్తవ్య బోధ చేస్తుంది. త్రిమూర్తులారా! మీకు ముగ్గురికి ఇవ్వబడిన బాధ్యతలు చాలా ముఖ్యమైనవి. కాబట్టి మీ ముగ్గురి మధ్య కలహాలు ఏర్పడకూడదు. పరస్పర సహకారం, పూజ్య భావంతో మీ మీ కార్యములను నిర్వర్తించండి. శివకేశవులకు బేధం లేదు. ఈ విధంగా సృష్టి స్థితిలయలు నిరంతరం జరుగుతూ వుంటాయి. మహా ప్రళయం సంభవించినప్పుడు మీరు ముగ్గురూ కూడా నాలో లయం అయిపోతారు.

పరమాత్మ నిర్గుణుడు, అవ్యయుడు, నిరాకారుడు, నిరంజనుడు, అనంతుడు. ఎవ్వరికీ కనబడడు. ఏదైనా కార్యం నిర్వహించాల్సివస్తే ఆయన అంశతో నేను సాకారియై సర్వ కార్యములను చేస్తుంటాను. పరమాత్మ దృక్కు మాత్రమే, దృశ్యం కాదు అంటూ జగదాంబ అంతర్ధానం అయ్యెను.

> వాస్తవంగా మరణం లేనే లేదు. మరణం ఉంటే జననం అనే ప్రశ్న ఉదయిస్తుంది. మనం దేహంతో తాదాత్మ్యం చెంది అమృతాత్మను విస్మరిస్తే జననం మరణం అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. మరణమనే దాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే దేహోహం అనే భావన తుదముట్టించుటే అవుతుంది. అదే దానికి సరైన అర్థం నిజమైన జన్మ నువ్వు నీ సహజస్థితిలో నిలకడ కలిగి వుండుట. అన్నిరకాలైన ఆలోచనల నుండి స్వేచ్ఛగా వుండుట మూలకారణమైన దేహాత్మభావాన్ని పరిత్యజించుట అహంభావం అంతరించుట.
>
> – *శ్రీ రమణ మహర్షి*



# ప్రణవము

**(శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తేది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశము)**

***– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు***

(గత సంచిక తరువాత)...

ఇచ్చిన దాంట్లో ఏం కక్ష వుంది? "కారుణ్యము వున్నది" మరి 'స్థితికర్త'.

"ఆయన రాక్షసుల్ని చంపేశాడు, అన్ని కోట్లమందిని చంపేశాడు" అని మీరేగా అన్నది ఇందాక, ఆయన అలా చంపకపోతే, పడగొట్టేయకపోతే, ఈ శరీరం నుండి జీవుడ్ని విడదీసేయకపోతే, వాడు తనకున్న బలాన్ని దుర్వినియోగం చేసుకొని, ఇంకెన్ని పాపకార్యాలు చేసి, ఎంత అప్రతిష్ఠ, అపకీర్తి తెచ్చుకొని, అధర్మం చేసి, ఎంత పతనమైపోతాడో! పోన్లే పాపం రావణాసురుడని వదిలేస్తే, వాడికి వాడు నాశనమైపోతాడు, అప్రతిష్ఠ తెచ్చుకొని, అధర్మాచరణం చేసి, ఉన్న శక్తితో లోకములు పాడుచేస్తాడు. ధర్మాన్ని కాపాడటానికి పడగొడుతున్నాడు. ఒక వైద్యుడు ఒక కురుపుని కోసేస్తాడు. ఏ ఆయనకేమైనా కోపమా, కురుపుని కోసేసాడు అంటే దుష్టాంగమును శిక్షణ చేసి, శిష్టాంగమును రక్షిస్తున్నాడు. మిగిలిన శరీరాన్ని కాపాడాలంటే ఆ కురుపుని కోసేయాలి. తప్పదు. వైద్యుడుకి కోపం వచ్చి కోసేశాడంటారా? ఆయనేమైనా ప్రతీకారం తీర్చుకొన్నాడా? కక్షుందంటారా? లేదు. కారుణ్యంతో కోసేస్తున్నాడు. ఈ కురుపును కోసేయకపోతే, పాపం వీడు చాలా బాధ పడిపోతాడు. అందుకని ఒక్క పదినిమిషాలు బాధ కూడా లేకుండా మత్తిచ్చి తీసేస్తున్నాడు. కాబట్టి ఆయన చేసిన సంహారము నందు "కారుణ్యము" ఉన్నది. వైద్యుడు సెగ్గడ్డ కోయటం ఎటువంటిదో, విష్ణువు రాక్షస సంహారం చేయడం అంత గొప్పది. **"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"** "ధర్మాన్ని స్థాపించడం కోసం, లోకములు పాడైపోకుండా వుండడం కోసం విశ్వం అన్న శరీరాన్ని కాపాడటం కోసం, రాక్షసుడు అన్న సెగ్గడ్డని కోస్తున్నాడు".

ఎందుకు ఆయనలో క్రౌర్యం ఉన్నదని అనుకుంటారు. విష్ణువు నందు క్రౌర్యం లేదు. "కారుణ్యమే" వున్నది. మరి శంకరుడు, మహాప్రళయము నందు లోకములనన్నీ పడగొట్టేస్తున్నాడు గదండీ! అందరి జీవుల్ని తనలోకి తోసేసుకుంటున్నాడుగా! మరి అలా మహా ప్రళయం చేయడమనేది బాధాకరమైనటువంటి విషయం కదండీ! నిశ్శేషం చేస్తున్నాడు. లోకంలో ఒక్క భూతం లేకుండా, అంటే ఇది క్రౌర్యం కాదా! ఒకటి ఆలోచించండి! శివుడు మహాప్రళయము అంటే మూడురకములైన ప్రళయములను చేస్తాడు. అందులో ఒక ప్రళయాన్ని

ఏమంటారంటే, "ఆత్యంతిక ప్రళయము" అంటారు. అయితే, ప్రతీరోజు కూడా చేసేటటు వంటిది ఒకటి. అది "నిత్య ప్రళయం". రెండవది "ఆత్యంతిక ప్రళయము". మూడోది "మహా ప్రళయము". ఈ మూడింటియందు "దయ" మాత్రమే వుంటుంది. నిత్య ప్రళయము అంటే ఈశ్వరుడు నాకీ కళ్ళు ఇచ్చాడు, ముక్కు ఇచ్చాడు, చెవులిచ్చాడు, నాలుక ఇచ్చాడు, చర్మం ఇచ్చాడు, శరీరం ఇచ్చాడు, శక్తి ఇచ్చాడు, ఇన్నీ ఇచ్చాడు శక్తి తరిగిపోతుంటే, పొంద డానికి భూమిమీద పంట ఇచ్చాడు. దానిని తింటే మరలా లోపల కూర్చుని

"అహం వైశ్వానరో భూత్వా, ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

దానిని జీర్ణం చేసి నోట్లోకి లాక్కుని, శక్తిగా మార్చి, తెల్లవారేటప్పటికి మిగిలిపోయిన పిప్పిని సంప్రనీకరణములు సడలిపోకుండా చేసి బయటికి వెళ్ళిపోవడానికి మార్గాన్ని సుగమం చేస్తున్నాడు. ఆయన ప్రతిరోజు రాత్రివేళ నిద్రాకాలిక సుఖాన్ని ఇవ్వకపోతే, ఇంద్రియములకు కలిగిన బడలిక ఎలా తీరుతుంది? నేను ఎంత అలసిపోనివ్వండి! రాత్రి నేను ఎక్కడ పడుకున్నానన్న సంబంధం కూడ లేదు. కటిక నేలమీద పడుకున్నా, నిద్రపట్టేసి, తెల్లవారేసరికల్లా అవయవాల యొక్క బడలికల్లా తీరిపోతుంది. ప్రతీరోజు ఆయన భూతాలన్నిటికీ నిద్రాకాలిక సుఖాల్నిచ్చి, ఇంతమందికి శక్తినిస్తున్నాడు. విశ్వప్రళయం, ఆయన చేస్తున్నదాంట్లో "కారుణ్యం" లేదూ! ఆయన నిద్ర ఇవ్వకపోతే ఆకలి ఎలా వేస్తుంది. రాత్రి నిద్ర లేదండీ! చాలా బరువుగా ఉంది! తిన్నది అరగలేదు! అంటాడు. రాత్రి బాగా నిద్రపోతే, కడుపునిండా తింటాడు. కడుపునిండా తింటే, కనురెప్ప పడిపోతుంది. కనురెప్ప పడిపోతే, బాగా నిద్రపోతాడు. బాగా నిద్రపోతే, బాగా ఆకలేస్తుంది. బాగా ఆకలేస్తే బాగా తింటాడు. బాగా తింటే బాగాపడుకుంటాడు. అంటే తినడం, పడుకోవడమే కాదు, బాగా పని చేస్తాడు అని కూడా నా ఉద్దేశ్యం. కాబట్టి ఇప్పుడు శంకరుల యొక్క అనుగ్రహం లేకపోవడం ఏంటి? నిత్యప్రళయంలో ఆయన మహాకారుణ్యమూర్తి. ఆత్యంతిక ప్రళయము అని ఒకటి వుంటుంది. అందుకే తెల్లగా వుంటాడు. తెల్లగా వుండడానికి అర్థం ఏమిటంటే శుద్ధజ్ఞానమూర్తి అని. అజ్ఞానాన్ని తీసేసి, జ్ఞానం ఇస్తాడు. అందుకే "జ్ఞానదాత మహేశ్వరః", "పంచకృత్య పరాయణా" అని అమ్మవారికి పేరు. పంచకృత్యములలో తిరోధానము, అనుగ్రహము అని రెండు వుంటాయి. అనుగ్రహ మందు ఆయన జ్ఞానమిచ్చి, మోక్షమిస్తాడు. ఆ జ్ఞానమివ్వగలిగినటువంటివాడు కనుక, ఆయన జ్ఞానమిస్తే, ఆత్యంతిక ప్రళయము అంటారు. ఎన్ని అవకాశాలిచ్చినా, అంటే ఎన్నిసార్లు శరీరం ఇచ్చినా, శరీరంతో రావడం సంసారము నందు ఇరుక్కుపోవడం మావాళ్ళు, మావాళ్లు అని పిచ్చి పెంచుకొని అదేపనిగా స్వార్థంతో ప్రవర్తించడం, చిట్టచివరికి శరీరం పడిపోవడం,



మళ్లీ ఇంకోచోట పుట్టడం,

"పునరపి జననం పునరపి మరణం,
పునరపి జననీ జఠరే శయనం,
ఇహ సంసారే బహుదుస్తారే కృపయాపారె పాహిమురారే"

ఒక్కొక్కసారి నేనే ఉన్నాను. ఎవరో వచ్చి అడుగుతుంటారు ఎవండీ ఒక్కరోజు ఏదో ఫలానా ఊరు రాకూడదా! అంటారు. రాలేనండి! విసుగెత్తిపోయింది. ఈ నెలల్లో ఎన్ని ఊళ్ళు తిరిగానో, ఇంటి పట్టున మా ఆవిడ వండిపెట్టిన పప్పు, కూర, చారు తిని ఎన్నాళ్లయిందో నాలుగు రోజులు ఇల్లు వదిలిపెట్టి రాను ఇక్కడే వుంటా! ఏం ఆ పూళ్లో పప్పు, కూర, చారు పెట్టరా? పడుకోమా? మంచం ఇవ్వరా? నిన్ను ప్రేమగా చూడరా? నిజానికి వాళ్లు చాలా ప్రేమగా చూస్తారు. మరి ఎందుకు ఇంటికెళ్ళిపోతావు అంటే, నా ఇంటికెళ్ళిపోతే నాకదో సంతోషం. తిరిగి తిరిగి తిరిగి తిరిగి ఎప్పుడెళ్ళిపోతానా అంటాడు. అది ఒక ముచ్చట. అదే చూడండి ఆఫీసుకెళతాడు, ఇంటికెళ్ళడంలో సంతోషం. ఆఫీసుకి టైంకెళ్ళడం కష్టమేమో గాని, ఇంటికి టైంకి వెళ్ళడంలో సంతోషం. ఎందుకనీ అంటే, తానున్న చోటికి వెళ్ళిపోతూ ఉండాలని అది మనిషి యొక్క లక్షణం. మహాప్రళయము నందు ఏం చేస్తాడంటే, ఇప్పటికి ఎన్ని కోట్ల శరీరాలనిచ్చానురా! నీకు, ఎన్ని ఇచ్చినా, వాడుకోలేకపోయావు, ఎందుకోసం? దీన్ని వాడుకుని వుంటే, దీంతో గురువు గారి పాదాలు పట్టుకొని, దీంతో శాస్త్రాన్ని పట్టుకొని వుంటే, విహిత కర్మాచరణం చేస్తే, నీకు పాత్రత కలిగి జ్ఞానం కలిగేది. నీవు అవేం చేయలా! ఎంతసేపు భోగం భోగం భోగం భోగం భోగం... దానికే వాడావు. ఇంకెన్ని శరీరాలివ్వ మంటావు? ఎన్నాళ్లు తిరుగుతావు? కొన్నాళ్లు విశ్రాంతి తీసుకో! అని, అన్ని భూతములకూ కొన్నాళ్లు విశ్రాంతి. మరొక చమత్కారం చూసారో లేదో! ఎంత రంజకత్వంతో ఉన్నా, మధ్యలో విశ్రాంతి అవసరం లేకపోతే మీరా భోగం తట్టుకోలేరు. "లవకుశ" సినిమా 4 గం॥లు వేస్తే చూడలేరు. 2 గం॥లు తర్వాత మధ్యలో విశ్రాంతిలో 10 ని॥లు వదిలేయాలి. లేకపోతే తట్టుకోలేరుట. అందుకే భోగాలను అనుభవిస్తూ ఉన్నా, మధ్యలో విశ్రాంతి కావాలి జీవులకు. అందుకే శంకరులు ఏం చేస్తారంటే, మీరు నన్ను ఎలాగూ పొందలేకపోయారు. నేను మిమ్మల్ని పొందేస్తాను. నల్లపూసలు ఎగిరి మైనపు ముద్దను పట్టుకోలేకపోయినాయి. మైనపు ముద్ద నల్లపూసల మధ్యలో పడింది. ఇప్పుడేమయింది. నల్లపూసలు అంటుకుంటాయా లేదా మైనపు ముద్దకి?

అలా జీవులను తాను పొందేస్తాడు. పొందేసి, కొంతకాలం వాళ్ళందరికీ విశ్రాంతి ఇస్తాడు. అదే మహా ప్రళయం. విశ్రాంతినిచ్చి మళ్లీ సృష్టిని మొదలుపెట్టి, కొన్నాళ్లు అలసట

తీర్చుకొన్నావు గదా! ఇప్పటికైనా ఓరేయ్ చక్కగా వేరే యుగంలో ఏమిటంటే పుణ్యం అబ్బుతుంది. ఆయన శరీరంతో కలిసి ఉన్నాడు చాలా కాలం, ఏ కృతయుగంలోనో మళ్లీ పుట్టినప్పుడు పుణ్యకార్యములు ఆచరించి తత్ఫలితంగా పాత్రతని పొంది, జ్ఞానం పొంది, మహావాక్యాన్ని పొందుతాడు. మహాప్రళయం చేయడం వెనుక కారుణ్యమేనా వున్నది! మహాప్రళయం చేయడం వెనుక ఎక్కడైనా ఆక్రోశం వున్నదా! ఉండదు. "కారుణ్యమే ఉన్నది". ఇప్పుడు బ్రహ్మగా సృష్టి చేసినా కారుణ్యమే. విష్ణువుగా స్థితిని చేసినా కారుణ్యమే. శివునిగా ఆత్యంతిక ప్రళయం చేసినా, నిత్య ప్రళయం చేసినా, మహా ప్రళయం చేసినా కారుణ్యమే. కాబట్టి, "ఓంకారము" యొక్క "తత్త్వమే"మి? కారుణ్యమే. ఏది "ఓం"? అకార, ఉకార, మకారములే సృష్టి, స్థితి, లయలే "పరబ్రహ్మము". కాబట్టి నీవు అనవసరంగా నీకున్న నామరూపాల తాదాత్మ్యతని భగవంతుని యందు ప్రవేశపెట్టవద్దు. అజ్ఞాన గ్రంథి విచ్ఛిన్న మవటం. "ఓంకారము"ను పరీశీలించడం అంటేనే అజ్ఞానం పోతుంది. 'ఇలా చూడగానే', ఈమె మా ఆవిడే, వీడు నా కొడుకే, ఇవి నా రుద్రాక్షలే, ఇది నా ఉత్తరీయమే, అన్నట్లుగా, "వీడే" నేను – ఆరాధించేవాడు, నేను ఆరాధించేవాడు ఈలాగు ఈ ప్రేరణలో ఈ పేరుతో ఉంటాడు తప్ప, ఇంకోలాగా ఉంటే, నాకు సంబంధముండదు" అన్నమాట వుండదు. విశ్వమంతా విశ్వనాధుడే. లోకమంతా లోకేశ్వరుడే. అసలు భగవంతుడు లేని ప్రదేశం లేదని,

"అంతః బహిచ్ఛ తత్సర్వం, వ్యాప్యనారాయణ స్థితః
దృశ్యతే శ్రూయతేపివా"

ఏది చూసినా బ్రహ్మమే, ఏది విన్నా బ్రహ్మమే, అసలు బ్రహ్మము వినా ఇంకొకటి లేదు. అంతటా బ్రహ్మము నిండిపోతే, "ఓంకారము" సిద్ధించింది అంటారు.

*(సశేషం...)*

నీ జన్మలో ఇంతవరకూ నీవు తెలిసియో, తెలికయో, బీదసాదల సేవలో వినియోగించిన ధనమే యెన్నటికైనను నీకు తోడ్పడును. అదియే నీ వెంట వచ్చునది. మిగిలిన ఆస్తులన్నియు మరియు నామరూపములన్నియు నిన్ను బంధించెడివియే.

**– శ్రీ ఓంకారస్వామి**



# ధ్యానము

**ఆంగ్లమూలం : స్వామి ఓంకార్** **అనువాదం : స్వామి తత్త్వవిదానంద**

*(గత సంచిక తరువాత...)*

సకల ప్రార్ధనలు, సకల పూజలు, సకల వ్రతములు మరియు సకల యోగములు లేదా సకల సాధనలు (ఆధ్యాత్మిక అభ్యాసములు మరియు అనుశాసనము), ఏదైనా, కేవలము ఈ భావనను మేల్కొలిపి, నియంత్రించి, నిలబెట్టుటకు మాత్రమే విధించబడినవి. దారి తప్పకుండా, ఈ దేహము నందు మరియు ప్రపంచము నందు ఈ అల్పమైన జీవితమునందు శక్తిని మరియు కాలమును వ్యర్ధము చేయకుండా, దైవత్వ స్పృహ యొక్క ఆనందమును అనుభవించుట కొరకు మాత్రమే ఇవి అన్నీ ఉద్దేశించబడినవి. ప్రతి వ్యక్తి ఈ సాధనలను తన స్థితిగతులకు, అవసరాలకు తగ్గట్లుగా అన్వయించుకొని సరియైన రీతిలో నిర్వహిస్తే, అవి అన్నీ ఒక లక్ష్యమును చేరుకొనే సాధనములుగా ఉపకరించవచ్చును. కాని, అవి ఎన్నటికీ తమంత తాము లక్ష్యములు కావు, లక్ష్యములుగా ఉద్దేశించబడలేదు. మనల్ని శరీరస్పృహ (దేహాభిమానము) నుండి విముక్తిని కలిగించి దైవత్వస్పృహలోనికి మేల్కొలుపుట అనే లక్ష్యమును ఇచ్చుటలో ఆ సాధనలు ఎప్పుడు ఎక్కడ అసమర్ధములగునో, అప్పుడు అక్కడ అవి తమ ఉద్ధేశ్యము నందు మరియు ఫలము నందు విఫలమైనవి. కావున వాటిలో మనము మార్పు చేసుకోవాలి, లేదా వాటిని త్రోసిపుచ్చవలెను. అట్లు గానిచో, అని మనము అనవసరంగా కోరి కావాలని తెచ్చిపెట్టుకున్న జోడింపులుగా పరిణమించి, మనకు తగుల్కొని అనావశ్యకమగు భారమును కలిగిస్తాయి. కాబట్టి మనము ఈ సాధనలను తెలివిగా ఎన్నుకోవాలి. ఏ విధమైన ఆటంకములు, విలంబము, కొరత లేదా వైఫల్యము లేకుండా, మనకు మన లోపలనే నిశ్శబ్ధమైన దైవత్వ సాక్షాత్కారము యొక్క దృష్టి అనే శాంతిపూర్ణమైన ఫలమును ఇచ్చే విధంగా ఈ సాధనలు ఉండాలి. వాటిని మనము ఆ విధంగా తీర్చిదిద్దుకోవాలి. అట్లు గానిచో, మనము ఆ సాధనల నుండి తొందరగా వెనుదిరిగి, శాంతముగా మనలో మనము ఉండిపోదాము.

ఇకపోతే, ఓ ప్రియమిత్రులారా! నన్ను క్షమించుడు. ఎందుకంటే, ఆరంభములోనే నేను మీకు ఒక వేరే గాథను చెప్తానని మీరు బహుశా ఆపేక్షిస్తూ ఉంటారని నా భయము. బహుశా నేను మీకు అన్నీ సిద్ధం చేసిపెట్టిన సాధనపద్ధతులను రూపకల్పన చేసిపెట్టి ఉంటానని, లేదా అట్టి పద్ధతులను మీకు ఉపదేశిస్తానని, సమాధిని సాధించుటకై సాధనయొక్క ప్రక్రియను ఉపదేశిస్తానని మీరు ఆపేక్షిస్తూ ఉండవచ్చును. నా ఉద్ధేశ్యము గాని, లక్ష్యము గాని అది కానే కాదని మీకు బహుశా ఇప్పుడే తెలిసిపోతుంది. నా మౌలికమైన లక్ష్యము నుండి నేను

ప్రక్కకు తొలగలేదు. నేను నా అసలు లక్ష్యము నుండి ప్రక్కకు దొలగలేదు. నా మౌలికమైన విచారమును, నేను నా దృష్టిని కేంద్రితము చేసిన విచారమును, మీకు అవగతము చేయుటకై నేను ప్రయత్నిస్తున్నాను. స్వామి రామ తరచుగా ఇల్లా చెప్తూ ఉండేవారు. సమాధికి కొంత దూరము, దారి అనేవి ఉండుటకు వీలు లేదు. సమాధికి గుళికల పద్ధతి ఏదీ లేదు, అని. ఎందుకంటే, అది యెప్పుడూ దూరంగా లేదు.

సమాధి కేవలము మీ లోపలికి ఒక అడుగు వేయడం మాత్రమే. అంతే కాదు. సమాధి అంటే మీరు మీ మడమలపై వెనుదిరిగినట్లు. లేదా, మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే, అదే క్షణమునందు, మీరు మీ స్వరూపమును చేరుకొనుటయే. క్రీస్తు మహాత్మునకు చెందిన నీతిగాథలయందు దారి తప్పిన కొడుకు అనే ప్రసిద్ధమైన కథ[1] గలదు. జనులు చాలా తప్పుగా గ్రహించి, తప్పుగా అన్వయించుకున్న కథలలో దీనిని మొట్టమొదట పెట్టవచ్చును. ఇతరములైన ఉపాయములు, వనరులు పూర్తిగా విఫలమైనప్పుడు, ఆ దారి తప్పిన కొడుకు మున్ముందుగా తన స్వరూపములోనికి తాను వచ్చెనని చెప్పబడెను. ఆ తరువాతనే అతడు తండ్రి సన్నిధిలోనికి ప్రవేశపెట్టబడెను. ఆ తండ్రియొక్క ఇంటిలోపల విశ్రాంతి, శాంతి, సంపద మరియు ఆనందము నిండియుండెను. ఆహా! కొడుకు తిరిగి వచ్చిన శుభసందర్భములో తండ్రి ఇంటిల్లిపాదికి విందు చేయగా, వారందరు ఆనందముతో నాట్యము చేసిరి! ఆ సందర్భములో తప్పు చేసితిననే దిగులు గాని, మూతి విరుచుటలు గాని, నిందారోపణములు గాని, హక్కుల చర్చలు గాని, ముఖము ముడుచుకొనుట గాని, నుదుటిపై కోపపు రేఖలు గాని, ఏడ్పులు గాని, తప్పును ఒప్పుకొనుట గాని, అపరాధ రుసుములు గాని, కోపించిన వారిని సాంత్వపరచుట గాని, ప్రాయశ్చిత్తములు గాని లేకుండెను. ఎప్పుడైననూ ఇటువంటివాటి గురించి ఏ కొంచెము ప్రయత్నమును చేసిననూ, ఆ తండ్రి ఆ ప్రయత్నములను ప్రోత్సహించకుండా వమ్ము చేసెను. స్వర్గధామము ఇటువంటి ప్రయత్నములకు సరియగు స్థానము కానే కాదు. అక్కడ ఆత్మ సాక్షాత్కారమును పొందిన జీవునకు తన హృదయము నందు సమాధికి చెందిన స్వర్గసుఖము యొక్క పరమానందము అంతా అనుభవానికి వస్తూ ఉంటే, ఇటువంటి నిరర్థక విషయముల యందు ఒక్క క్షణమైననూ వృథా చేయరాదు. చూడుడు! లోపలి స్వర్గములు తమ ద్వారములను తెరువగా, దైవ–ఆత్మ, పావురమువలె, జీవుని పవిత్ర–ఆత్మను పూర్ణమగు దైవీ–పవిత్రతతో మరియు శాంతికి పెన్నిధి. ఆ

[1] ఒక తండ్రికి ఇద్దరు కొడుకులు. వారిలో ఒకడు బుద్ధిమంతుడు కాగా, రెండవవాడు దారి తప్పినవాడు. ఆ రెండవవాడు తండ్రి నుండి తనకు వచ్చిన ఆస్తి వాటాను దుబారా చేసి, సర్వమును కోల్పోయి, తిరిగి తండ్రి వద్దకు రాగా, తండ్రి వానిని ప్రేమతో స్వాగతించి అక్కున చేర్చుకుంటాడు.



సమాధియందు దేవునకు, జీవునకు భేదము లేదు. అదియే యథార్థమైన ప్రాయశ్చిత్తము.[1] ప్రియమిత్రులారా! మీరు నిత్యముగా ఏది అయి ఉన్నారో, ఆ స్వరూపమును గుర్తెరుంగుటయే చేయదగినది. మీరు సర్వకాలములయందు ఏ చైతన్యము అయి ఉన్నారో, దానిలోనికి మేల్కాంచుటయే చేయదగినది. మీ స్వరూపము నందు పాపము లేదు. పాపము ఉండే ఆస్కారమే లేదు. మీరు నిత్యముగా భగవానునిచే పుత్రుడుగా, ఉత్తరాధికారిగా స్వీకరించబడియే ఉన్నారు. మీరు అమృతపుత్రులు. మీరు నిత్యప్రకాశ దైవీ– ఆనందము యొక్క సంతులు. మీరు సర్వదా పరమాత్మతో అభిన్నులై ఉన్నారు. కాలాతీతుడైన పరమాత్మ జగత్తునకు తండ్రి. ఆ తండ్రి యెదలో మీరు ఏకైక ప్రేమపాత్రులు. మీరు ఏ నాడైననూ తండ్రి యెడల పాపమును చేయలేదు అని తెలుసుకొనుడు. ఎందుకంటే, తండ్రికి విరుద్ధముగా పాపమును చేయుట, తండ్రి నొచ్చుకొనేట్లు చేయుట సంభవమే కాదు. ఆ తండ్రి పుత్రుడు కూడ పాపమును చేయజాలడు. ఎందుకంటే, ఆ పుత్రుడు ఏనాడైననూ తండ్రి కంటే వేరుగా లేడు. తండ్రికి ఆ విషయము ఎల్లవేళలా తెలియును. తనను తాను తెలుసుకున్నప్పుడు, తన చైతన్య స్వరూపములోనికి మేల్కాంచినప్పుడు, ఆ సత్యము కొడుకునకు కూడ తెలిసింది.

కాబట్టి, తప్పు పేరు[1]తో పిలువబడే ఓ దారి తప్పిన జనులారా! అన్నింటికంటె సరళమైన మరియు తక్కువ దూరము గల దారి మీ ముందు తెరుచుకుని ఉంది. అపవిత్రములు (అమంగళములు, పాపములు) లేవు, ద్వారములు లేవు, గుడి ప్రహరీలు లేవు. కరడు గట్టిన అజ్ఞానము వలన మాత్రమే అవి అన్నీ ఉన్నట్లు భాసిస్తోంది. కాబట్టి దేహమే ఆత్మ అనే అజ్ఞానపు పరదాను మీరు ముక్కలు ముక్కలుగా చింపివేయుడు. వెంటనే ద్వారములను విరుగగొట్టుడు, గోడల బండరాళ్లను లాగి పారవేసి పునాదులతో సహా కూల్చివేయుడు.[2] పదార్థముల గుండా పదార్థములయందలి యథార్థతత్త్వమునరయుడు. పదార్థముల లోపలి అసలు సిసలు తత్త్వమును పట్టుకొని, వాటిని (నామరూపములను) వదలిపెట్టుడు. పండు లోపలి గుజ్జును అట్టి పెట్టుకుని తొక్కను పారవేయుడు. అది మీ జన్మహక్కు. దాని కొరకై మీరు శ్రమించి సంపాదించనక్కరలేదు, దాని కొరకై (ఇతరులను) కోరనక్కరలేదు. శ్రామికులై శ్రమిస్తున్నంత వరకు దానిపై హక్కు, దానిని ఎంచుకొనుట అనేవి ఉండవు. వారు ఆ రోజు కూలికి మాత్రమే అర్హులౌతారు. వారు ఆ రోజు కూలిని తీసుకుని సత్య–ఆత్మకు దూరంగా ఉండిపోతారు. అట్టి కూలీలు కూలి గింజలకై వేడుకుంటూ ఉంటారు.[3] వారు కాలము

[1] ఇక్కడ స్వామీజీ atonement అనే ఇంగ్లీషు పదమునకు చాలా అందముగా శ్లేష (రెండు అర్థములను చెప్పుట)ను జేసినారు. ఒకటి ప్రాయశ్చిత్తమైతే, రెండవది at-one-ment, జీవేశ్వరుల అభేదము. స్వామి ఓంకార్ మహారాజుల వారు క్రైస్తవ సాహిత్యములోని గాథకు ఇక్కడ వివరించిన అంతరార్థము క్రైస్తవ పండితులకు కూడ ఉపాదేయము.

[1] అసలు పేరు పరమాత్మ

[2] అజ్ఞానము వలన కలిగే కామనలను, భయములను పారద్రోలుడని అభిప్రాయము.

[3] అల్పమైన ఫలమును కోరి కామ్యకర్మలను చేయురాని స్వామీజీ ఆశయము.

యొక్క  సంతానము.[1] కాలముయొక్క సంతానమైన అట్టివారికి ఆ శ్రమ, దాని వలన గిట్టే కూలి సరిపడతాయి. కాని, మీరు అమృతపుత్రులు. శాశ్వతపితయగు ఆ పరమాత్మ మీకు ప్రాణశక్తి యొక్క అమృతమును[2] శాశ్వతకాలము సరఫరా చేస్తూ ఉంటాడు. దానిని మీరు ఉచితముగా పొంది స్వతంత్రులై ఆనందించుడు.

కాబట్టి, ఓ ప్రియమిత్రులారా! ఇప్పుడు నేను సుదూరమైన, చుట్టూ తిరిగే, కష్ట సాధ్యమైన, లేదా నిగూఢమైన దారిని చెప్పి మిమ్ములను నిరుత్సాహపరచి ఉండవచ్చును. దానికి కారణమేమంటే, మీకు చాలా సంతోషముతో కూడిన అచ్చెరువును కలిగించే దారిని చూపుటయే నా అభిప్రాయము. ఆ దారిపైన చెప్పిన దారికంటే తేలికయైనది, సరళము, సులభతరము. వాస్తవంలో ఈ దారి దారులన్నింటికంటే దగ్గర, సులభము మరియు సరళము. నిజం చెప్పాలంటే ఇది దారి కానే కాదు. ఇది కేవలము కన్నులను తెరచి చూచుటయే, మీ లోపల మీరు దైవస్వరూపులై ఉన్నారని గుర్తెరుగుటయే, మీ శాశ్వతమైన వారసత్వమును గుర్తు పట్టుటయే.

పృథివి అంతము వరకు (దేహాభిమానముతో) పరిభ్రమిస్తూ శ్రమించే ఓ జనులారా! నా వైపు చూడుడు. మీరు చేయాల్సినది ఇంతే. వెనుదిరిగి (అంతర్ముఖులై) మీ లోపల చూడుడు, రక్షణను పొందుడు. నేను–భావనను పైకి లాగి[3] (స్వరూపముపై) కేంద్రితము చేసినచో, ఆ నేను–భావనయే సకలజనులను నా వద్దకు ఆకర్షించగలదు. దాని వలన దేహము అనే బంధము, పరిభ్రమణము[4]ల నుండి విముక్తి కలుగును. ఇదియే శుభవార్త. మీలోనే ఉన్న స్వాతంత్ర్యము, ఆనందము మరియు శాంతి అనువాటికి చెందిన సంక్షిప్త సువార్త ఇదియే.

*(సశేషం...)*

[1] వారు పుట్టి గిట్టుతూ కాలముచే కబళించవేయబడే సుఖములను పొందుతారని అభిప్రాయము.

[2]జ్ఞానఫలమగు మోక్షము.

[3]అంటే దేహాభిమానమును విడిచిపెట్టి అని యర్థము.

[4]చావు–పుట్టుకలు



# నేతాజీ సుభాష్ చంద్రబోస్

**– సిలువేరు సుదర్శన్**

నేతాజీ యొక్క హృదయం బాల్యం నుండియే పరుల దుఃఖముపట్ల ఆర్ద్రతతో నిండి ఉండేది. కళాశాలకు వెళ్ళేటప్పుడు అతడికి ఒక అత్యంత దుర్భలమైన వృద్ధురాలు యాచిస్తూ కనిపించేది. అటువంటి శిథిలమైన శరీరంతో యాచించే వృద్ధురాలి నిస్సహాయతను చూస్తూనే భారతమాత యొక్క ఈ సుపుత్రుడి మనస్సులో ఎంతో బాధ కలిగేది. అతడు ఆ వృద్ధురాలికి ఆర్థిక సహాయం చేయాలనుకొనేవాడు అయితే తండ్రి నుండి ధనాన్ని అడుగలేదు. దానికి అతడికి ఒక ఉపాయం కలిగింది. అతడు ట్రామ్‌బండిలో కళాశాలకు వెళ్ళడానికి బదులుగా ఇంటి నుండి కళాశాల దాకా కాలినడకన వెళ్ళడం మొదలుపెట్టాడు. అలా ప్రోగైన డబ్బును అతడు ప్రతీవారం ఆ వృద్ధురాలికి ఆర్థిక సహాయముగా ఇస్తుండేవాడు. అలా ఎన్నో నెలలు దాకా జరిగింది. తర్వాత అతడి తండ్రికి మొత్తం విషయం తెలిసింది. సుభాష్ ఆ వృద్ధురాలికి సహాయార్థం కాలినడకన వెళ్ళడం మానుకోడు కాబట్టి ఆ తండ్రి తగిన ధనరాశిని ఆ వృద్ధురాలికి ఇచ్చాడు.  ఈ విధంగా సుభాష్ చంద్రబోస్ యొక్క ఉద్దేశ్యం నెరవేరింది.

స్వాతంత్ర్యానికై ఉధృతంగా ప్రయత్నాలు చేయడం వలన నేతాజీ బ్రిటీషు ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారాడు. బ్రిటీషు ప్రభుత్వపు ఉన్నతాధికారులు అతడంటే పూర్తిగా భయ పడసాగారు. అతడిని బంధించడానికి ఎన్నో ప్రయాసలు చేసినప్పటికీ ఫలితం లభించక పోవడంతో చివరికి ఆంగ్ల ప్రభుత్వము కుటిల నీతితో నేతాజీని మరియు అతడి సహచరులను న్యాయస్థానం ద్వారా రాజద్రోహం యొక్క అబద్ధపు ఆరోపణను మోపి దానిని ఋజువు చేయించి ఆరునెలలు కఠోర కారాగార శిక్షను విధింపజేయించడం జరిగింది.

ప్రజల యొక్క ఆక్రోషాన్ని శాంతింపజేయడానికి మరియు సుభాష్ చంద్రబోస్ పట్ల సానుభూతిని ప్రదర్శించడానికై ఉన్నత న్యాయస్థానము కుటిల నీతితో ఒక షరతును పెట్టింది. అదేమిటంటే సుభాష్ మరియు అతడి అనుచరులను విడిచిపెట్టడం జరుగుతుంది. అయితే ఆరు నెలలదాకా వారు ఎటువంటి రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనకూడదు. కాని తన స్వాతంత్ర్య ప్రాప్తి యొక్క లక్ష్యానికి ఒక్క క్షణం కూడా దూరంగా ఉండడమనేది అతడికి నిప్పులపైన నడవడంతో సమానంగా అనిపించేది. అలాంటిది ఆరునెలలదాకా దూరంగా ఉండడాన్ని అతడెలా ఓర్చుకొనగలడు! నేతాజీ నిర్భయంగా జవాబిచ్చాడు. “నాకు ఈ షరతు ఎలా అనిపిస్తుందంటే ఎవరైనా వ్యక్తికి జీవించే అవకాశాన్నిచ్చి శ్వాసను తీసుకోకూడదన్నట్లుగా ఉంది. నేను ఎటువంటి రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనకూడదు అనే ఈ షరతును నాకు

ఒకవేళ 10 సంవత్సరాల శిక్ష తగ్గించినప్పటికీ తిరస్కరిస్తాను".

అతడు జైలులో ఉండడానికి అంగీకరిస్తూ ఆంగ్లేయుల యొక్క వ్యర్థపు షరతును తిరస్కరించాడు. పూజ్య బాపూజీ ఇలా అంటారు "ఎవరైతే నిశ్చలంగా, దృఢంగా ఉంటాడో ఆ వ్యక్తి అన్నిరకాల పరిస్థితులను దాటుకొని తన లక్ష్యం దాకా చేరుకొనే తీరతాడు" జరిగింది కూడా అదే, కొన్నిరోజులు తర్వాత ప్రభుత్వం అతడిని విడుదల చెయ్యక తప్పలేదు. విడుదలైన కొన్నిరోజులలోనే కలకత్తా కార్పోరేషను భవనము వద్ద మొట్టమొదటిసారిగా జాతీయ జెండాను ఎగరవేసి అతడు బ్రిటీషు ప్రభుత్వాన్ని ముక్కుమీద వ్రేలు వేసుకొనేలా చేశాడు.

కరుణ మరియు దృఢత్వం గుణాలను మనము అలవరచుకోవాలి.

---

1. **సమానులెవరు ప్రభో - మీకు సమానులెవరు ప్రభో**
   **సమానులెవరు ప్రభో! స్వామీ! సమానులెవరు ప్రభో ॥**
2. **నిత్యము జరిగెడి అన్నదానములు - నిరతము జేసెడి వైద్యసేవలు**
   **విద్యాబోధలు, సత్సంగాలు - నీ ఆశయమే నిర్మల హృదయా... ॥**
3. **వందేళ్ళైనా వర్ధిల్లెడి మీ - కొలువుకూట మొకకోమల సదనం**
   **ప్రశాంతి నిలయము - ప్రసాదించితిరి ॥**
4. **కనికరమున మీ కరుణను జూపుచు**
   **కాలిదుమ్మునే దానము జేసిరి ॥**
5. **దేశదేశములు తిరిగి తిరిగి మీ**
   **శాంతిమంత్రమును సాటి వచ్చితిరి ॥**
6. **మహాతపస్వీ! మహిమాన్వితులై**
   **మా స్వామీజీ! మహారాజౌనీ !! ॥సమానులెవరు ప్రభో॥**

***- శ్రీ కె. కోటేశ్వరరావు***



# ఉపదేశ సారము

***- వినతి***

మాయ గురించి ఒక చిన్న కథ. ఒకానొక దేశపు ఆచారాన్నిబట్టి ఆ దేశములో ఒక ఏనుగు ఎవరి మెడలో పూలదండ వేస్తుందో, వారే ఆ దేశానికి రాజు అవుతారు. అలా ఒకరోజు ఆ దేశపు రాజు ఎన్నుకోబడతాడు. తర్వాత ఆ రాజుకు వివాహం అయ్యి, సంతానము కూడా కలుగుతారు. ఆ సమయంలో ఆ రాణికి తీవ్రంగా అనారోగ్యం కలుగుతుంది. రాణి లేకుండా తాను ఎలా జీవించగలను అని రాజు విపరీతమైన దుఃఖానికి గురి అవుతాడు. అప్పుడు ఆ రాజ్యంలోని వారు అంటారు, రాజా మీరు ఇంతగా దుఃఖించవద్దు. మా దేశపు ఆచారాన్ని బట్టి భార్య ఎక్కడికిపోతే భర్తను అక్కడకే పంపిస్తారు. అప్పుడు రాజు భయపడి స్మశానానికి పోవలసివస్తుందని, రాజ్యాన్నే వదిలి పారిపోతాడు. అంటే ఇక్కడ అసలు రాజు ప్రేమిస్తున్నది ఆత్మను అంతే కాని రాణి యొక్క ఉపాధిని కాదు. ఎవరమైనా లోపల వున్న ఆత్మను మాత్రమే ప్రేమిస్తాము, కాని ఉపాధిని ప్రేమిస్తున్నట్లు భ్రమపడతాము, కాని అది వాస్తవము కాదు.

ఈ విధముగా మాయ అనేది ఎంతటివారినైనా, ఎప్పుడూ ఆవహించి వుంటుంది. కాబట్టి భగవంతుడికి రోజూ ప్రార్థన చేయాలి. ఈ మాయలో పడకుండా మమ్మల్ని కాపాడు, మాయను జయించే శక్తిని మాకు ఇవ్వు అని. కాని ఈ మాయ ద్వారా ఏమి జరుగుతుంది? ఈ ప్రపంచం అంతా నా నుండే ఉత్పత్తి అవుతోంది అన్న అహంకారం ఏర్పడుతుంది. అజ్ఞానం ద్వారా జగత్తు వేరుగా వుంది, నేను వేరుగా వున్నాను అని ఈ సుఖ దుఃఖాలను అన్నింటిని కూడ అనుభవిస్తున్నాను.

ఉదా॥ ఒక నాటిక వేస్తున్నాము అనుకోండి. అందులో వివిధ పాత్రలు పోషిస్తాం. రాజుగానో, భిక్షగాడుగానో, ఎన్ని పాత్రలు పోషించినా తన అసలు స్వరూపాన్ని మాత్రం గుర్తు పెట్టుకుంటాము. అలాగే రంగస్థలంలో పాత్రకు తగినట్లు ఎన్నో వస్తువులను ఉపయోగిస్తాం. కానీ రంగస్థలం వదలగానే ఆ వస్తువులు అన్నీ అక్కడే వదిలేస్తాం. అలాగే మనం ఈ ప్రపంచ వస్తువులతో కూడ తాదాప్యం పెట్టుకోకుండా వదిలివేయాలి. భగవంతుడు లోపల వుండి సూత్రధారిగా మనల్ని నడిపిస్తున్నాడు. ఈ ఆత్మే అంతటా వుంది అని ఎప్పుడు తలచుకుంటామో అప్పుడే ఈశావాస్యమిదం సర్వం అని గ్రహించగలుగుతాం. అంటే మనలో వుండే అహాన్ని ఎక్కడి వరకు వ్యాపింపజేస్తాము అంటే ఆత్మ అనేది ఎక్కడో లేదు విశ్వము అంతా వుంది అన్నంత వరకు...

"సర్వేషాం ఆత్మ హృది పశ్యంత, హృదయ మిది తస్మాత్ హృదయం" ఆత్మ అందరి హృదయాలలోను వున్నది. భగవద్గీతలో భగవానుడు అంటాడు "మమైవాంశో జీవలోకే, జీవభూత సనాతనః" ఈ "నేను" అనేదాన్ని విశ్వాత్మలో లయం చేయాలి. జపం, ప్రాణాయామం ద్వారా ఈ మనస్సు లయం అవుతుంది. కాని పూర్తిగా నశించదు. ఎక్కడి నుండి స్ఫురణ కలుగుతుందో అలా విచారణ చేస్తూ మనలోని వాసనలను ఎప్పుడైతే క్షయం చేసుకుంటామో, అప్పుడు ఆ "నేను" అనేది నశించి విశ్వాత్మలో లయం అవుతుంది.

ఉన్నది అంతటా ఒక్కటే ఆత్మ అయితే, ఎందుకు వేరువేరుగా కనిపిస్తోంది ప్రపంచం అంటే, ఉదా॥ ఒకే వ్యక్తి తండ్రిగా, కొడుకుగా, భర్తగా, స్నేహితుడుగా రకరకాల పాత్రలను పోషిస్తున్నట్లు వ్యవహారం కోసం విభిన్నంగా కనిపిస్తోంది. కాని లోపల వున్నది మాత్రం ఒక్కరే! సాధన ద్వారా ఈ భిన్నత్వాన్ని తొలగించుకోవాలి. సాధన అనేది శరీర అవయవాలు దృఢంగా ఉన్నప్పుడే మొదలుపెట్టాలి. అంతేగాని, వృద్ధాప్యం కలిగిన తర్వాత కాదు.

రమణ మహర్షి చెప్పే ప్రాణాయామ సాధన, మనం శ్వాస తీసుకుంటున్నప్పుడు నేను ఎవరు అనే ప్రశ్న వేసుకుంటూ చేయాలి. అంతే కాని కేవలం ఆరోగ్యం కోసం ప్రాణాయామ సాధన కాదు. అలాగే శ్వాస విడిచిపెట్టేటప్పుడు కూడ ఈ శరీరం, మనస్సు నేను కాదు అనే భావంతో సాధన చేయాలి. అంటే విచారణతో ప్రాణాయామం చేయాలి.

నాలుగు ఆశ్రమాల వారికి ఆత్మసాధన చేయడానికి అవకాశం వుంది. అర్హత కూడ వుంది. వారి వారి యొక్క వ్యవహారిక కర్తవ్య కర్మను బట్టి ఉపాధి లభించినది. అంతేకాని ఆత్మసాధనకు ఈ ఉపాధులు అడ్డం కావు. మనం చేసే ప్రతి పని పూర్తి భగవత్ అర్పిత భావంతో చేస్తే కొన్నాళ్ళకు తానే అది అవుతాడు. ఉదా॥ పప్పారామ్‌దాస్ గారు నిరంతరం రామనామము చేసేవారు. ఒకసారి ఒక ఇంటి అరుగు మీద ఆయన పడుకొని వున్నారు. ఒక దొంగవాడు వచ్చి, తను దొంగిలించిన వస్తువులను పప్పా దగ్గర వదలి వెళ్ళిపోతాడు. తర్వాత పోలీసులు వచ్చి పప్పాను జైలుకు తీసుకెళ్ళి కోర్టులో హాజరుపరుస్తారు. అప్పుడు జడ్జిగారు విచారణలో పప్పా చెబుతారు. దొంగరాముడు వచ్చి, వస్తువులు వదలి వెళ్ళాడు, పోలీసు రాముడు పట్టుకొచ్చి, జడ్జి రాముడి దగ్గర వదలిపెట్టాడు. ఇంతకు మించి నాకు ఏమి తెలియదు అంటారు. ఏమి జరుగుతూ వున్నా, పప్పాగారి మనసులో మాత్రము రాముడే నిండి వున్నాడు. అందుకే లోక వ్యవహారం ఏమి అతన్ని బాధించలేదు. కాబట్టి దేహభావన, లౌకిక భావన వీడి, భగవత్ భావనలో కర్మలు చేస్తే ఈ జీవుడు (అహం) విశ్వ వ్యాపకం అవుతుంది. కాబట్టి ఎప్పుడూ ఆ ఎరుక అనేది అత్యవసరం. అదే పరమాత్మతత్వం వైపు మనల్ని నడిపిస్తుంది.

**హరిః ఓమ్ !**



# ఏడుచేపల కథ

*- శ్రీమతి వేల్పూరి సీతాదేవి*

అనగా అనగా ఒక రాజున్నాడు. అతనికి ఏడుగురు కొడుకులు. ఏడుగురు వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చి ఎండబెట్టారు. అందులో ఆరు చేపలు ఎండాయి. ఒకటి మాత్రము ఎండలేదు. అప్పుడు వాళ్ళా చేపదగ్గరకి వెళ్ళి చేపా చేపా ఎందుకు ఎండలేదు అని అడిగారు. గడ్డిదుబ్బు అడ్డం వచ్చింది అని చెప్పిందిట. ఎందుకే దుబ్బుగడ్డి ఎండలేదు అంటే ఆవు నన్ను తినలేదు అందిట. ఎందుకే ఆవు తినలేదు అని అంటే గొల్లవాడు నన్ను ఇప్పలేదు అందిట. ఎందుకు గొల్లా ఆవును విప్పలేదు అంటే అవ్వ గంజి పోయలేదు అన్నాట్ట. ఎందుకు అవ్వా గంజి పొయ్యలేదంటే పిల్లాడు ఏడుస్తున్నాడు అందిట. ఎందుకురా బాబు ఏడుస్తున్నావు అంటే చీమ కుట్టిందన్నాట్ట. ఎందుకు చీమ కుట్టావంటే నా బంగారు కన్నంలో చేయి పెడితే కుట్టనా అందిట.

ఈ కథ చిన్నప్పుడు అందరు తల్లులు పిల్లలకు చెప్పే కథ. కానీ దాశరథి మహాకవి గారు వేదాంతపరంగా ఇలాగ వివరించారని గరికపాటి నరసింహారావు గారు అభివర్ణించారు దూరదర్శన్‌లో.

ఆరుచేపలు ఎండాయి అంటే అరిషడ్ వర్గాలు. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్యర్యములు.

ఏడవది మనస్సు నుండి పుట్టిన సంకల్పము. సంకల్పము సరిగ్గా ఉంటే, మంచిగా ఉంటే రెల్లుదుబ్బులాంటి ఆలోచనలు దగ్ధం అయిపోతాయి. ఒక్క అగ్గిపుల్లతో రెల్లుగడ్డి అంతా నిమిషంలో అంతరిస్తుంది. ఎందుకే రెల్లుదుబ్బు అడ్డం వచ్చావు అంటే ఆవు మేయలేదు అందిట గదా. ఆవు అంటే జ్ఞానము అన్నమాట. అంటే జ్ఞానం కలిగితే గానీ రెల్లుగడ్డిలాంటి ఆలోచనలు ఆరిపోవు. ఎందుకే ఆవు మేయలేదు అంటే గొల్లపిల్లాడు నన్ను కట్టులిప్పలేదు అందిట ఆవు. శ్రీకృష్ణుడు గొల్లపిల్లవాడు, జగత్‌గురువు. గురువు కరుణించనిదే జ్ఞానం రాదు. గురువుని అడిగితే అమ్మ (అవ్వ) గంజి పొయ్యలేదు అంటే, అమ్మ కరుణించలేదు. అమ్మ ఆజ్ఞ ఉంటేగానీ నేను ఏమీ చేయలేను. ఇంకో బిడ్డ ఏడుస్తూంటే అతనిని కరుణించడానికి వెళ్ళింది అమ్మ.

వాడిని చీమ కుట్టింది. ఎందుకే చీమ కుట్టావు అని అడిగితే నా బంగారు కన్నంలో చేయి పెడితే కుట్టనా అందిట. ఈ లౌకిక ప్రపంచములో బంగారు పుట్టలాగ మనకి కనిపించి

అందులో వేలు పెడుతున్నామన్నమాట. పుట్టలో ఇంకా లోతుగా చేయి పెడితే పాములు కూడా కుడతాయి. చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనట్లు అని పద్యం ఉంది గదా! మనకి బంగారు రంగులో పుట్టలాగ కనిపిస్తుంది ఈ ప్రపంచము.

మాయ అనే సంకల్పము మనకు కలిగి ఉండినంత కాలము ఆ ఏడవ చేపలాగ ఎండలేము, అన్నీ అడ్డు తగులుతూ ఉంటాయి.

# మతము

"నేడు ప్రపంచమందు కొన్ని దేశములలో మతము నిరాకరించబడినది. మరికొన్ని దేశములందు లెక్కచేయబడుటలేదు. నిరాకరించబడుట కంటే అశ్రద్ధ చేయబడుటే ఎక్కువ ప్రమాదకరము. దీనికి కేవలము మతము ననుసరించుచున్నామని చాటుకొనిన ప్రజలే గాక, మతము పేరిట మానవుని మనస్సును అణచివేసిన అనేకులు కూడ కారణము. నేడు మనము వైజ్ఞానిక (సైంటిఫిక్) యుగమందున్నాము. ప్రకృతి కుహరములోనికి ప్రవేశించి మానవుని మనస్సు దాని రహస్యముల నవగతము చేసికొని భౌతిక పరిస్థితులను వశము చేసికొనినది. చూచుటకు, పరీక్షించుటకు, గ్రహించుటకు వీలైన వస్తువులనెల్ల చూడమని, పరీక్షించమని, గ్రహించమని విజ్ఞానము చెప్పుచున్నది. మతముననుసరించుచున్నామను అనేకులు క్రియా క్షేత్రమందున్న బాధ్యతలను తప్పించుకొని తమ స్వంత ముక్తికై పాటుబడుచున్నారు. ఒకవేళ ప్రాపంచిక కర్మలందు పాల్గొనినవారు ఉన్న వ్యవస్థనే బలపరచుచున్నారు గాని, తమ ఆదర్శములను నిత్యజీవిత మందు సాధింప ప్రయత్నించుటలేదు. మతము విప్లవశక్తిగాకుండ పోయినది. ఇట్టి విమర్శలు నేడు చేయబడుచున్నవి. కాని మన మతము ఇట్టి వివమర్శలకు పాల్పడదు. నిజముగా దివ్యత్వమే అయిన నరత్వ సత్తువ కడ్డమేదియు పడలేదు. మన పూర్వ ఋషులు తమ ఆధ్యాత్మిక నేత్రములతో అనవరతము చూచుచు అనుభవము గడించిరి. ఉపనిషత్తులలోనున్న జ్ఞానఫలములు అనుభవమే. ఈ ఆధ్యాత్మికానుభవము పైననే మన రచయితలాధారపడిరి. ఈ ఆధ్యాత్మికానుభవము భౌతిక, తారిమీకానుభవము కంటే ఉత్కృష్టమని వారి అభిప్రాయము.

భారతదేశోపాధ్యక్షులు **డాక్టర్ రాధాకృష్ణన్**

(29.7.53 బొంబాయి సాధనాశ్రమములో ఇచ్చిన ఉపన్యాస సారాంశము)



# గణేశ ప్రాశస్త్యం

**- శ్రీమతి వాడ్రేవు శారద**

**శుక్లాం భరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే ॥**

మనమందరము గణపతిని - పార్వతి పుత్రునిగా, శంకరునిచే శిరస్సు ఖండింపబడి, గజాననుగా ప్రకటితమయినట్లు వ్యవహరింతుము. మన శరీరంలో మూలాధారం శక్తి (పార్వతి) స్థానం. దానికి కావలిగా గణపతి. ఈకుండలిని మేల్కొని షట్చక్రములను ఛేదించి సహస్రారమును చేరును. కుండలిని మేల్కొలుపుటలో 'యోగసిద్ధి' కల్గును. మనస్సుకు పైగానున్న 'బుద్ధి' కూడా మేల్కొనును. ఈ సిద్ధి-బుద్ధి; ఇడా-పింగళా నాడులలో గణపతి ఇద్దరు భార్యలుగా చెప్పబడినారు. మంత్రశాస్త్రములో గణపతులు ముప్పయి ఇద్దరు రూపాలుగా పేర్కొన్నారు.

వేదవ్యాస విరచిత గణేశ పురాణములో, ప్రళయానంతరము ప్రణవనాదము క్రమముగా గజానన రూపము పొందినట్లు వ్రాయబడెను. పరమాత్మస్వరూపుడైన విఘ్ననాయకుని - సర్వకార్యారంభములందు, ప్రవేశనిర్గమాదులయందు శ్రౌతస్మార్తాది కర్మల యందు, లౌకిక వైదిక కర్మల యందు - స్మరించి పూజించుటచే సకల విఘ్నములు మాయమగును.

వేదవ్యాసుడు పురాణములను రచించుటకు ప్రారంభించి విఘ్నేశ్వరుని స్మరించక పోవుటచే స్తబ్ధబుద్ధి గలవాడై, చింతించి బ్రహ్మ కడకేగెను. బ్రహ్మ వ్యాసునికి ద్విరజానుని శరణు పొందమని చెప్పెను. తన విద్యాగర్వముచే - గణేశుని స్మరించి, పూజించకపోవుటచే వ్యాసునికి ఈ దుస్థితి కలిగినదని చెప్పెను. వ్యాసుడు ఏకాక్షర గణపతినుపాసించి, సర్వ విద్యలసారం గ్రహించి, సర్వచంధస్సులతో నేర్పబడిన భాషాచాతుర్యమంతా హస్తగతం చేసుకొని మహాభారతంను ఆశుధారగా రచించెనని నిగూఢ రహస్యం. (మహాభారతం వినాయకుడు వ్రాసినాడనుటకు మూలకారణం ఇదియే) వేదవ్యాస మహర్షి రచించిన 18 ఉపపురాణములలో గణేశ పురాణం ముఖ్యమైనది. "నాల్గు బాహువులు కలవాడై, పెద్ద దేహము ధరించి, రత్న కిరీటం ధరించి పరశవు, కమలము, మాల, మోదకములు హస్తముల ధరించిన దివ్యాంబర ధరుడు, ఏకదంతుడు, సూర్యసమానమైన కర్ణకుండలములు కలవాడు, దివ్యాలంకారభూషితుడు, సర్పవలయము నుదరమున ధరించినవాడు, దేవర్షి గంధర్వ కిన్నెర భుజగగణములతో సేవించబడెడివాడుగా వినాయకుడు వర్ణింపబడినాడు.

(ఆగమములందు ఏడుకోట్ల గణేశ మంత్రములు చెప్పబడినవి. వానిలో ఏకాక్షరి, షడక్షర మంత్రములు గొప్పవి)

మధుకైటభులను జయించుటకు, విష్ణువు–శివుని నుండి గణేశ షడక్షరమంత్రోపాసన పొంది–సిద్ధక్షేత్రంలో గండకీరాళ్ళతో విగ్రహం నిర్మించి, గజాననుని ఉపాసించాడు. పార్వతీ దేవి హిమవంతుని నుండి గణేశ మంత్రం పొంది, శివుని కొరకు తపమాచరించి, శివుని అర్ధాంగి అయినది. గౌతమముని శాపముతో సహస్ర భగత్వము పొందిన దేవేంద్రుడు, సర్వసిద్ధి ప్రదాయకమైన గణేశాష్టాక్షరీ మంత్రోపాసనతో సహస్రాక్షుడయ్యాడు. త్రిపురాసురసంహారమునకు ముందు, గజాననుడు శివునికి తన సహస్రనామములు ఉపదేశించెను. ఆ ప్రదేశమే మణిపురమని పేరు పొందింది. పుట్టుకతోనే అంధుడు, చెవిటివాడు, మూగవాడు, శరీర మంతయు దుర్గంధపూరితమైయున్న దక్షుడను రాజకుమారుడు, తండ్రిచే పరిత్యజించబడెను. తల్లితో గ్రామగ్రామమునకు తిరుగుచుండెను. గజానన భక్తుడయిన బ్రాహ్మణశ్రేష్టుని (ముద్గలుడు) గాలి తగలగనే దివ్యదేహుడయ్యెను. ఆ బ్రాహ్మణునివద్ద గణేశ అష్టాక్షరీ మంత్రమును తీసుకొని పంద్రెండు సంవత్సరములు భక్తితో అనుష్ఠానము చేసి రాజ్యమును పొందెను. కామాతుర అయిన మునిపత్ని ముకుంద శాపముతో రుక్మాంగదురు కుష్ఠురోగ గ్రస్తుడయ్యెను. విదర్భ దేశమందున్న చింతామణి వినాయక దేవాలయమందలి గణేశ కుండలము దర్శించి, స్నానమాచరించినంత మాత్రమునే స్వస్థుడాయెను.

సంకటచతుర్థీ వ్రతమాచరించి భ్రుశుండు తాను గణేశ లోకమును పొందుటే గాక తన పూర్వీకులను గూడ ఉద్ధరించెను.

గణేశ ఏకాక్షర మంత్రమును ఒక లక్ష గాని, లక్షన్నర గాని జపించాలి. షడక్షరి, పంచాక్షరి, దశాక్షరి, అష్టాక్షరి మహామంత్రములను లక్ష గాని, పదివేలు గాని జపించాలి. ఇరువది యెనిమిది అక్షరముల గల మంత్రమును పదివేలు జపించవలెను.

వర్తమాన కాలమున "గణంజయో గణపతి; హేరంభో ధరణీధర
మహాగణపతి; లక్షప్రద క్షిప్రపసాదన;
అమోఘసిద్ధి రమితో మంత్ర చింతామణి ర్నిధి;
సుమంగళో బీజ మాశోపూరకోవరదశివ;
కాశ్యపోనన్దనో వాచాసిద్ధో దుంఢి వినాయకః ॥

అను ఏకవింశతి నామములతో మండలం రోజులు గణపతిని గరికతో పూజించిన కార్యసిద్ధి జరుగునని పెద్దలమాట.

వేదవ్యాస విరచిత 'గణేశ పురాణం' నుండి గ్రహించడమైనది.

ఓం శ్రీ గణేశాయ నమః



# కైవల్యోపనిషత్

**- స్వామిని శృతానంద**

అశ్వలాయనుడు ఒక ఆచార్యుడు. అంతే కాదు, గొప్ప రాజు అని కూడా అంటారు. అనేక పుణ్యకర్మలు చేసిన పిదప అత్యంత ఉన్నతమైన బ్రహ్మవిద్యను పొందాలి అనే జిజ్ఞాస కలిగినది. జీవుడు ప్రపంచంలో పరిగెత్తి పరిగెత్తి అలసిపోయి, తర్వాత గమ్యం చేరలేక పోతున్నాడని తెలుసుకొని అప్పుడు వస్తాడు భగవంతుడ్ని గురించి తెలుసుకోవడానికి. అంటే బ్రహ్మ విద్యను ప్రపంచంలో పరిపక్వం చెందిన తర్వాతే నేర్చుకోగలము.

మానవుడికి ప్రపంచంలో అంతా వెతికి వెతికి చివరికి అలసిపోయిన తర్వాత ఉపయోగపడే విద్య బ్రహ్మవిద్య. నిజంగా శాంతి సంతోషాలను ఇచ్చేది ఈ విద్య. జీవితాన్ని ఎలా జీవించాలి అని నేర్పేది ఉపనిషత్తు జ్ఞానం. "సంసరతి ఇతి సంసారః" నిరంతరం మార్పులకు లోనై వెళ్ళిపోతూ వుంటుంది సంసారం. కాబట్టి దాన్ని పట్టుకోకూడదు. భగవంతుడు మాత్రమే మనల్ని ఒక్కసారి పట్టుకుంటే ఇక వదలడు. కాబట్టి భగవంతుడ్ని మనం గట్టిగా పట్టుకోవాలి. ప్రపంచం "ప్రకర్షేణ పంచ" పంచేంద్రియాలలో మనకు వశం అయ్యేది ప్రపంచం. ఈ ఇంద్రియాలకు అతీతమైన తత్త్వాన్ని తెలుసుకోవాలంటే ఎంతో కష్టం. కారణం దానికి మనస్సు అంతర్ముఖం కావాలి. కాని మనసు సహజంగా బహిర్ముఖమై మనల్ని ఈ ప్రపంచం వైపుకే లాగుతూ వుంటుంది.

అశ్వలాయనుడు సాక్షాత్ భగవత్ స్వరూపుడైన గురువుగారి దగ్గరకు వెళ్ళి, విద్యలన్ని ంటిలోను శ్రేష్ఠమైన విద్య, అత్యంత రహస్యమైన విద్య, సర్వపాపాలను తొలగించే విద్యను తనకు బోధించమని ప్రార్థిస్తాడు. ఇక్కడ పాపం అంటే, "పతనాత్ పాపం" మనల్ని క్రింద పడవేసేది పాపం. అంటే భగవంతుడి నుండి మనల్ని దూరం చేసే ప్రతి ఆలోచన పాపమే! పాపాలు తొలగడమంటే వాసనా క్షయం. అవి దుర్ వాసనలు కావచ్చు. సత్ వాసనలు కావచ్చు. రెండూ తొలగితేనే మోక్షానికి మార్గం ఏర్పడుతుంది. అశ్వలాయనుడికి ప్రాపంచికమైన ఆశలు ఏమీ లేవు. కాని నిగూఢమైన వాసనలు వున్నాయి. అవి తొలగితేనే ఆ పరమతత్త్వాన్ని అందుకోగలడు.

పితామహుడైన బ్రహ్మదేవుడు అశ్వలాయనునకు బ్రహ్మవిద్యను శ్రద్ధాభక్తి ధ్యాన

యోగముల ద్వారా తెలుసుకొనుము అని ఉపదేశించెను. శ్రద్ధ అంటే శాస్త్ర వాక్యాలందు, గురువు వాక్యాలందు పూర్తి విశ్వాసం కలిగి వుండడము. అది కేవలం మనస్సు స్థాయిలో కాదు, బుద్ధిస్థాయిలో కలిగి వుండడం. కారణం మనసు మారుతూ వుంటుంది. కాని బుద్ధి మాత్రం స్థిరంగా వుంటుంది. తర్వాత భక్తి అంటే ప్రేమ. ప్రేమను భగవంతుడి వైపు మళ్ళిస్తే భక్తి. అదే ప్రేమను పెద్దవాళ్ళవైపు కనబరిస్తే గౌరవము, పిల్లలవైపు కనబరిస్తే వాత్సల్యం, సమవయస్కులవైపు కనబరిస్తే స్నేహం. ప్రేమకు పరిపూర్ణత భగవంతుడ్ని అన్నిటిలో చూడడం. శ్రద్ధ, భక్తి వుంటేనే ధ్యానం సులభం. నేను నమ్మినది, నాకు ఇష్టమైనది అయిన వాటిమీద ధ్యానం చేయడం సులభ సాధ్యం. ధ్యానం అంటే పూర్తిగా మమేకం అయిపోవడం. అశ్వలాయనుడికి అన్ని తెలుసు కాని గురువుగారి అనుగ్రహం వలన గురువు నోటి ద్వారా వెలువడే వాక్యాలు మంత్రం అయ్యి మార్గం చూపిస్తాయి.

---

### శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి !

- శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
- సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే). M.O. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
- M.O. ఫారంలో దిగువ For Communication భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
- చందా కాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొంటే మంచిది.
- అడ్రసు మార్పును ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
- చందా వివరములు తెలుపని యెడల సొమ్మును విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శాంతి ఆశమం (PO)**
వయా శంఖవరం-533 446, తూ॥గో॥ జిల్లా.



# నా అనుభవం

**- శ్రీమతి సరోజిని, శ్రీ శాంతి ఆశ్రమం, విశాఖపట్నం.**

ఆత్మ పరిశోధన యోగ సాధన సప్తాహములో పాల్గొనిన సాధకురాలిగా నా అనుభవమును తెలియజేయుచున్నాను.

బ్రహ్మ ముహూర్తమున 3-30 గంటలకు సాధన ప్రారంభమయినది. గురుమంత్ర జపము, ప్రణవనాదాను సంధానము వాచకము, ఉపాంశు, మానసిక జపము, జపవిధానము వివరించి సాధకులచే ఆచరింపజేసిరి. సచ్చిదానంద పరబ్రహ్మమును గూర్చి విపులముగా బోధించి, అనంతము అవ్యయము ఆదిమధ్యాంతరహితము, ఆనంద స్వరూపముగా వర్ణించి, సత్-చిత్-ఆనందముగా అదే **'నేను', 'ఉనికి', 'ఎఱుక'** గా హృదయమునకు హత్తుకొను రీతి బోధించిరి. అనాహతనాదానుసంధాన విధానమును విపులీకరించి సాధన చేయించినారు. ప్రజ్ఞాప్రత్యవీక్షణచే అంతర్ముఖమై చూచేవానిని చూడమనుచు Observe the Observer అని సాధనతో సాధించమని బోధించినారు. మనోవీక్షణ ద్వారా సాక్షి చైతన్యముగా నిలిచి, 'నేను'ను తెలుసుకొని 'ప్రజ్ఞ' నీవు జడమైన దేహము కాదు సత్యం, జ్ఞానం ఉనికి ఎఱుక నీవు సచ్చిదానందము కనులు తెరచి ఉంచి మనసును అంతర్ముఖం గావించమని లోనికి చూడమని తెలిపినారు. శరీర స్పందనలు-రక్తనాళ ప్రసరణ-స్పందనలు గుర్తించమని మనసును సూక్ష్మము గావించమని అస్థిపంజర వీక్షణ గావించి జడమైన దేహమును నీవు కాదు, అంతటా నిండి యున్న అనంత సచ్చిదానంద చైతన్యము నీవని ఇన్ని 'నేను'లు లేవు ఉన్నది ఒకే ఒక 'నేను'గా విశ్వశక్తి చైతన్యముగా విశ్వాత్మ దర్శనము చేయగలిగిన శక్తికై ఖగోళ, వైజ్ఞానిక శాస్త్ర వివరణములు - 'Film' ద్వారా చూపించి, వివరించి, లక్షలాది సూర్య కుటుంబములు, మిల్కీవే గెలాక్సీలను చిత్రముల ద్వారా చూపించి వివరించినారు.

అణువులు, పరమాణువులు, శక్తి తరంగాలు, రక్తప్రసరణ మొదలైన అపురూప విజ్ఞాన శాస్త్ర విషయములను వివరించినారు. బ్రహ్మమును అనంతనమైన కోటానుకోట్ల సూర్య గోళములు, నక్షత్రములు గూర్చిన రహస్యములు, విశ్వమంతా నిండియున్న అనంతశక్తి విజ్ఞానమును వివరించి, సచ్చిదానంద పరబ్రహ్మ ప్రేమమయ, కరుణామయతత్త్వమును విశదీకరించినారు. సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మ మొదలగు ఉపనిషత్ వాక్యార్థములను వివరించి, 'నేను'ను సచ్చిదానంద పరబ్రహ్మముగా గుర్తించి, బిందువు - సింధువు, అల - సాగరము ఉదాహరణతో యీ అనంతకోటి 'నేను'లు ఒకే ఒక సచ్చిదానంద పరబ్రహ్మముగా తెలియుటకు చేయవలసిన సాధనలు.

మూడు గంటల చొప్పున దినములో మూడుసార్లుగా తొమ్మిది గంటల సాధనతో పాటుగా వైజ్ఞానిక, ఖగోళ, ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించి నీవు జడమైన దేహము కాదు, చైతన్యవంతమైన సచ్చిదానంద స్వరూపము అనుచూ బోధించినారు. అంతటా నిండి యున్న విశ్వాత్మ చైతన్యమే నీవు సత్యం – ఏకం – అనంతం – బ్రహ్మమనచు బ్రహ్మమనగా ఎక్కడో లేదు, నిన్ను నీవు తెలుసుకున్న నీవే బ్రహ్మము అని తెలిపిరి.

యీ విధముగా శ్రీ శాంతి ఆశ్రమములో పూజ్య ఓంకారస్వామి శత జయంతి ఉత్సవ సందర్భముగా పూజ్య మాతా జ్ఞానేశ్వరి వారి ఆధ్వర్యములో, పూజ్య వినమ్రానంద సరస్వతి వారి పర్యవేక్షణలో సాధనా శిబిరము దిగ్విజయముగా జరిగినది. సాధకులకు అమృతాహారము మొలకలు, ఖర్జూరము, ఫలములు, అటుకులు, పెరుగు మరియు యోగరసము ఏర్పాటు చేసి ప్రేమపూర్వకముగా అందించిరి. సాధకులు తీసుకొనవలసిన ఆహార నియమములననుసరించి, ఆహార ప్రణాళిక ననుసరించి పూజ్య వినమ్రానంద వారి పర్యవేక్షణలో అందించినారు. యీ విధముగా యోగి ప్రజ్ఞారణ్య స్వామి (యోగి ప్రోటోప్లాజమ్) వారు ప్రసాదించిన ఆత్మ పరిశోధన యోగసాధన సప్తాహము లోకశాంతి ప్రార్థనతో సంపూర్ణమైనది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

---


**మాతృ ఆశ్రమం**

1. శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533446
వయా శంఖవరం, తూ॥గో॥ జిల్లా
ఫోన్ : 7382009962
**e-mail : srisanthiashram@gmail.com**

**2. విశాఖ శాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం, ఫోన్ : 0891-2538689
**e-mail : srisanthiashramvsp @gmail.com**

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి,
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్,
డార్‌మోనా రోడ్, కోటగిరి-643217
నీలగిరి జిల్లా, తమిళనాడు
ఫోన్ : 04266-271945
**e-mail : vsvmsktg@yahoo.in**
**vsvmsktg@gmail.com**

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్,
కాకినాడ-533 004,
తూ॥గో॥ జిల్లా.

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టుపేట,
పిఠాపురం – 533 450.

website : www.srisantiashram.org.in




విజ్ఞప్తి !

# గోశాల పునర్నిర్మాణము

**ఓం నమో భగవతే ఓంకారాయ**
**ఓం నమో భగవతే వాసుదేవాయ**
**ఓం శ్రీ గోమాత్రే నమః**

దివ్యాత్మ స్వరూపులకు ప్రణామములు. పూజ్య ఓంకారస్వామి స్థాపించిన గోశాలలో గోవులు – 25, దూడలు – 30, గిత్తలు – 7, దినాభివృద్ధి గావింపబడుతున్నాయి. గోఘృతంతో నిత్యం ప్రణవ హోమం నిర్వహించబడుచున్నది. గురుకుల బాలబాలికలకు, ఆశ్రమ వాసులకు గోక్షీరము వినియోగింపబడుచున్నది. గోమాతలు వశించు గోశాల శిథిలావస్థకు వచ్చినది. పూజ్య స్వామీజీ వారి ఆశీస్సులతో గోశాల పునర్నిర్మాణము చేయుటకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు సంకల్పించిరి. గోమాతలు నివశించుటకు 5 షెడ్డులు అవసరమున్నవి. ఒక షెడ్డు నిర్మాణమునకు సుమారు రూ॥ 5,00,000/- (ఐదు లక్షలు) ఖర్చు అగునని నిర్ధారణ చేయబడినది.

రూ॥ 10,000/- (పదివేలకు) పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఒక రోజునకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 150/-. ఒక నెలకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 4,500/- అగును. వారి వారి శక్తి అనుసారము గ్రాసమునకు దాతలు సహకరించవలసినదిగా మా విన్నపము. గోగ్రాసమునకు సమర్పించిన దాతల నామ గోత్రములతో, గోవులకు గ్రాసము అందించబడును. ఒక గోవునకు సమర్పించిన గ్రాసము 10 అశ్వమేధ యాగములకు సమానము అని గోమహత్యంలో చెప్పబడినది.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, గోమహత్యం పట్ల విశ్వాసం ఉన్న వాళ్ళు గోశాల పునర్నిర్మాణము మరియు గోగ్రాసము కొరకు ధన రూపంలో లేదా డి.డి. గాని, చెక్కు గాని శ్రీ శాంతి ఆశ్రమం పేరున విరాళము పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళమునకు 80జి ప్రకారము ఇన్‌కంటాక్సు మినహాయింపు కలదు.

**ఓం తత్సత్**

గురుసేవలో
**– *వినమ్రానంద సరస్వతి***

# వార్తలు - మాతృ ఆశ్రమం

**ది. 21-6-2017 :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మాతృ ఆశ్రమం, కోటగిరి, విశాఖపట్నం శాంతి పాఠశాలలో యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

**ది. 7-7-2017 :** కీ॥శే॥ ముత్యాల సుబ్బారాయుడు మాష్టారు వారి జ్ఞాపకార్థంగా వారి కుమారులు కీ॥శే॥ డా॥ ఎమ్.యస్.యన్. మూర్తి గారు ఏర్పాటు చేసిన 10వ తరగతి ఉత్తమ ఫలితం పొందినవారికి గోల్డ్‌మెడల్ మరియు రొక్కం రూ. 1,116/- 2016-17 సం॥ చి॥ అత్తిలి సాయి, వెంకటనగరం మరియు తేటకాయల స్వామి, ఉద్దండ, జగన్నాథపురం వారికి పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారిచే అందించబడినది. స్వామిని వినమ్రానంద మాతాజీ "విద్వాన్ సర్వత్ర పూజ్యతే అని, మాతృదేవోభవ, పితృదేవోభవ, అతిథిదేవోభవ, ఆచార్యదేవోభవ" అనే ఉపనిషత్ వాక్యాలను విద్యార్థులకు నిత్యజీవితంలో ఆచరించమని పల్కిరి.

**ది. 9-7-2017 :** గురుపూర్ణిమ సందర్భంగా పూజ్యశ్రీ ఓంకారస్వామి పాదుక అష్టోత్తర శతనామార్చన, భగవాన్ వ్యాసుల వారి అష్టోత్తర శతనామార్చన ఆశ్రమవాసులచే సామూహికంగా నిర్వహించబడినది. ది. 9-7-2017 నుండి చాతుర్మాసము సందర్భంగా ది.31-7-2017 వరకు శ్రీ లక్ష్మీనారాయణ అష్టోత్తర శతనామార్చన, శ్రీ లక్ష్మీనారాయణ హవనము, బ్రహ్మచారి శ్రీ శాంతానంద గారిచే యజ్ఞశాల యందు నిర్వహించడం అయినది.

---

**బ్రహ్మలీన పూజ్యశ్రీ చిదానందస్వామి వారి జన్మతేది 24న,** ప్రతి నెలవలె ఈ నెల కూడ మాతృ ఆశ్రమం, కాకినాడ, పిఠాపురం, కోటగిరి, విశాఖ శాఖలలో వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ జరిగినది.

పదిమందితో మంచిగా ఉండడమంటే ముందు మన మనసుతో మంచిగా ఉండగలగాలి. తర్వాత దేవునితో మంచిగా ఉండగలగాలి. తర్వాత మనకు తారసపడే వారందరితో మంచిగా ఉండగలగాలి.

*- శ్రీ పరమహంస యోగానంద*



# వార్తలు - కాకినాడ శాఖ

**ది. 21-6-2017 :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా శ్రీ ఆర్.టి.జి.వి. రామకృష్ణారావు యోగా మాస్టారు గారిచే యోగా కార్యక్రమం జరిగినది.

అంతే కాకుండా ప్రతిరోజు ఉదయం 6 గం॥ల నుండి 7 గం॥ల వరకు శ్రీ వెంకటేశ్వర గురూజీ గారిచే, సాయంత్రం 5 గం॥ల నుండి 6-30 ని॥ల వరకు శ్రీరామకృష్ణారావు గురూజీ గారిచే, సాయంత్రం 6.30 ని॥ల నుండి రాత్రి 8 గం॥ల వరకు శ్రీ ఎమ్. హనుమంతరెడ్డి మాష్టారు గారిచే (విశేషంగా మహిళలకు) ప్రతిరోజు యోగ తరగతులు నిర్వహించబడుచున్నవి.

**ది. 9-7-2017 :** గురుపూర్ణిమ సందర్భంగా సా॥ 5 గం॥లకు స్వచ్ఛభారత్ యోగా మండలి గురువుగారైన శ్రీమతి వంగా గీత గారితో సహా 150 మంది సభ్యులు పూజ్యశ్రీ ఓంకారస్వామి ఆశీస్సులను కోరుకుంటూ కార్యక్రమం జరుపుకున్నారు.

## కార్యక్రమములు

**ది. 1-8-2017 - 6-9-2017 వరకు :** ఉదయం 7.30 ని॥లకు యజ్ఞశాల యందు శ్రీలక్ష్మీనారాయణ అష్టోత్తర శతనామార్చన బ్రహ్మచారి శాంతానంద గారిచే నిర్వహించ బడును. తేది 6-9-2017 ఉదయం 9 గం॥లకు అర్ధచాతుర్మాస సందర్భంగా పూర్ణాహుతి శ్రీ ద్విభాష్యం సీతారామమూర్తి, పిఠాపురం వారిచే నిర్వహించబడును.

**ది. 14-8-2017 :** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మైత్రేయి ఆశ్రమం నందు శ్రీకృష్ణ భగవానుల అష్టోత్తర శతనామార్చన, భగవద్గీత పారాయణం బ్రహ్మచారిణి సుహిత చైతన్య గారిచే నిర్వహించబడును. రాత్రి 8 గం॥ల నుండి ప్రార్థన మందిరంలో సంకీర్తన, శ్రీకృష్ణభగవానుల అష్టోత్తర శతనామార్చన, శ్రీకృష్ణ జూల ఉత్సవము శ్రీ గంగరాజు మాష్టారు గారిచే నిర్వహించబడును.

**ది. 25-8-2017 :** వినాయకచవితి సందర్భంగా ఉదయం 8.30 ని॥లకు శాంతి గణపతి వద్ద గురుకుల బాలబాలికలచే శ్రీ గణేష్ ఆచార్య గారు శ్రీ గణపతి అష్టోత్తర శతనామార్చన జరిపించెదరు.

## శాశ్వత అన్నదాన పథకము

1. రూ. 5,000-00 శ్రీ సామంతపూడి నితీష్ గారు, చి॥ల॥సౌ॥ శిరీష గార్లు, వీరి పెండ్లిరోజు సందర్భముగా, విశాఖపట్నం.

2. రూ. 5,000-00 శ్రీమతి మాడుగుల నరేష్ గారు, W/o. శ్రీ మాడుగుల విశ్వేశ్వరరావు గారు, కలకత్తా, వీరి కోడలు శ్రీమతి మాడుగుల స్వప్నప్రియ గారి పుట్టినరోజు.

3. రూ. 20,000-00 శ్రీమతి దువ్వూరి సీతామహాలక్ష్మి గారు, హైదరాబాద్ వీరి తల్లిగారు కీ॥శే॥ ప్రేరేప సుదర్శనము గారి జ్ఞాపకార్థం ఆత్మశాంతి కోరుతూ.

4. రూ. 50,000-00 శ్రీ పచ్చిపులుసు రాఘవరావు గారు, గుంటూరు వీరి భార్య కీ॥శే॥ శ్రీమతి రామకుమారి గారి జ్ఞాపకార్థం ఆత్మశాంతి కోరుతూ.

5. రూ. 5,000-00 శ్రీ బి. రవించంద్ర గారు, కాకినాడ, వీరి తండ్రి గారు, కీ॥శే॥ బొమ్మిరెడ్డి రఘురామ్ గారి జ్ఞాపకార్థం ఆత్మశాంతి కోరుతూ.

6. రూ. 40,000-00 శ్రీ కె. నాగభూషణ ఆచారి గారు, విశాఖపట్నం, వీరి మామగారు కీ॥శే॥ దుద్దుపూడి సాంబమూర్తి గారి ఆత్మశాంతి కోరుతూ

7. రూ. 10,000-00 శ్రీ కె. నాగభూషణ ఆచారి గారు, విశాఖపట్నం, వీరి మామగారు కీ॥శే॥ దుద్దుపూడి సాంబమూర్తి గారి జ్ఞాపకార్థము, ఆత్మశాంతి కోరుతూ (పూజ్య స్వామీజీ జన్మదినం 21 జనవరినాడు)

8. రూ. 5,000-00 శ్రీమతి బి.హెచ్. పద్మావతి గారు, ఆకివీడు, వీరి తండ్రి గారు కీ॥శే॥ మంతెన నరసింహరాజు గారి ఆత్మశాంతి కోరుతూ.

9. రూ. 5,100-00 శ్రీ రాయసం ప్రభాకర వర్ధనరావు గారు, కళ్యాణ్ (మహారాష్ట్ర) వీరి తండ్రిగారు కీ॥శే॥ రాయసం సోమేశ్వరరావు గారి ఆత్మశాంతి కోరుతూ.

10. రూ. 10,000-00 శ్రీ సోమిశెట్టి హనుమంతరావు గారు, బచ్చల తాడిపర్తి, వీరి భార్య కీ॥శే॥ శ్రీమతి వీరభద్రం గారి ఆత్మశాంతి కోరుతూ.

11. రూ. 10,000-00 శ్రీ వెంకట దాసరి గారు, బెంగుళూరు, వారి తండ్రి గారైన కీ॥శే॥ శ్రీ డి.వి.యస్. రాఘవేంద్రరావు గారి ఆత్మశాంతి కోరుతూ.

12. రూ. 5,000-00 శ్రీ పుప్పాల ఆచార్యులరావు గారు, కూర్మన్నపాలెం (వైజాగు) వీరి భార్య కీ॥శే॥ సీతామహాలక్ష్మి గారి జ్ఞాపకార్థం, ఆత్మశాంతి కోరుతూ.

13. రూ. 5,558-00 శ్రీ పోకూరి మల్లిఖార్జునరావు గారు, ఏలూరు వీరి చెల్లెలు గారు వి.యమ్. భక్తి గారి పుట్టిన రోజు సందర్భముగా

14. రూ. 5,558-00 శ్రీ పోకూరి మల్లిఖార్జునరావు గారు, ఏలూరు వీరి పెండ్లిరోజు సందర్భముగా

## పశు సంరక్షణ

1. రూ. 4,000-00 శ్రీ కోలా జగదీష్ గారు, కాకినాడ, వట్టిగడ్డి నిమిత్తం

2. రూ. 1,000-00 శ్రీ నల్లం సత్యనారాయణ గారు, కాకినాడ వీరి కుమారుడు చి॥ భాను వెంకట నగేష్ గారి పుట్టినరోజు సందర్భముగా గోగ్రాసం నిమిత్తం



3. రూ. 1,000-00 శ్రీ నల్లం సత్యనారాయణ గారు, వీరి కోడలు చి॥ సౌ॥ సుధారాణి గారి పుట్టినరోజు సందర్భముగా గోగ్రాసం నిమిత్తం

4. రూ. 2,000-00 శ్రీమతి బి. సుబ్బలక్ష్మి గారు, కాకినాడ, C/o. శ్రీమతి వాద్రేవు శారద గారు

## విద్యార్థుల సంక్షేమము

1. రూ. 1,116-00 శ్రీ మద్దుకూరి రూపాకృష్ణ గారు, S/o. శ్రీ వెంకట రమేష్ గారు, బెండపూడి

2. రూ. 1,116-00 శ్రీ మద్దుకూరి రుషికసాయి గారు, D/o. ఎమ్. వెంకట రమేష్ గారు, బెండపూడి

3. రూ. 1,500-00 శ్రీమతి దాట్ల దీప్తి గారు, శ్రీ దాట్ల శివరామరాజు గారు, విశాఖపట్నం.

4. రూ. 7,100-00 శ్రీ ముమ్మిడి యతిరాజ్ & సన్సు, చెన్నై

5. రూ. 9,000-00 శ్రీ మర్రి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్, బీదవారి సహాయార్థం.

6. రూ. 2,000-00 శ్రీమతి పుప్పాల శ్రీగౌరి గారు, హైదరాబాద్, ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయుని జీతం నిమిత్తం.

7. రూ. 25,000-00 శ్రీ ఎన్.వి. సుబ్బారావు గారు & సన్సు, చెన్నై, విద్యాఖర్చుల నిమిత్తం.

## గోశాల నిర్మాణము

1. రూ. 10,000-00 శ్రీ మండ సూర్య వేంకటేశ్వర్లు గారు, బి.ప్రత్తిపాడు వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ మండ అయ్యన్న గారు, కీ॥శే॥ మండ సుబ్బలక్ష్మి గార్ల జ్ఞాపకార్థము

2. రూ. 10,000-00 శ్రీ కె.వి. ప్రసాదరావు గారు, రాజమండ్రి.

3. రూ. 10,116-00 శ్రీ మాటూరి జగన్మోహనరావు గారు, శ్రీమతి చెన్నలక్ష్మి గార్లు, గుంటూరు.

4. రూ. 10,000-00 శ్రీ వి.పి. సుశీల గారు, విశాఖపట్నం.

5. రూ. 10,000-00 శ్రీమతి శాంతి గారు, చెన్నై.

6. రూ. 2,000-00 శ్రీ డి.వి. రమణ గారు, ప్రెసిడెంట్, గీతా ప్రచార సంఘం, కర్నూలు

7. రూ. 10,000-00 శ్రీ మట్ట వీరవెంకట సత్యనారాయణ గారు, శ్రీమతి దుర్గాదేవి గారు, కాకినాడ, వీరి కుమారుడు కీ॥శే॥ మట్ట రవిశేఖర్ గారి జ్ఞాపకార్థం.

8. రూ. 10,000-00 శ్రీమతి ఎమ్. జయలక్ష్మి గారు, W/o. ఎమ్. విశ్వనాథరావు గారు, విశాఖపట్నం

9. రూ. 2,000-00 Lt. Col. K.D. రావు గారు, హైదరాబాద్.

10. రూ. 20,000-00 శ్రీ పి.యస్.యన్. మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్, పొందూరు,

11. రూ. 10,000-00 శ్రీ ఎమ్. వెంకటేశ్వరరావు గారు (చిట్టిబాబు గారు) ఏలూరు

12. రూ. 10,000-00 శ్రీ గట్టి సాయిరామకృష్ణ గారు, హైదరాబాద్

13. రూ. 10,000-00 శ్రీ వి. శ్రీమన్నారాయణ గారు, చెన్నై